దామో—అవల ఏకసుందరినిమిత్త మన్నమాట దివ్యముగా నున్నది.

పురు—"ప్రయత్నము చేయుచున్నందువలన సంభవింపఁ బోయెడి యుపద్రవమును ముందుగానే తొలఁగించుకొనుటకయి—"

దామో—ఉపద్రవమునా? అవును. అదిమంచిమాటే తరువాత

పురు—"నీవు దయచేసి—"

దామో—దయచేయుమని ప్రార్థించుటకయి నేను వానిని నాయింటికి విందుకుఁ బిలుతునా? ఆమాట సరిగా లేదు.

పురు—తొందర పడఁబోకు. చెప్పినట్టు వ్రాయుము.

దామో—మంచిది వ్రాసెదను. "నీవుదయచేసి" అయినది. అటుతరువాత?

పురు—"ద్వంద్వయుద్ధముచేసి మనలోమనమే యుద్ధముఖమున మనవివాదము పరిష్కరించుకొనుటకయి—"

దామో—ఇది సరి.

పురు—ఇఁక స్థలనిర్ణయము చేయవలెను. ఈపనికిజనోద్యానవన మనుకూలముగా నుండవచ్చును. — "ఊరిబయిల నున్నజనోద్యానవనములో నన్ను కలిసికోవలెను."

దామో—చాలును. ఈయుత్తరముమడిచి పయినిలక్కతో ఖడ్గముద్ర వేసి యిప్పుడే పంపెదను.

పురు—చూచినావా? ఈచిన్నయుత్తరమువలన మీలో మీకు సంభవింపఁబోయెడి పెద్దయుపద్రవ మొక్క దెబ్బను తప్పిపోవచ్చును.

దామో—ఉపద్రవము తొలఁగిపోవుటకే కాదా యిప్పుడీయుద్ధము?

పురు—ఇఁక కాలనిర్ణయము నీమనసువచ్చినది నీవే చేసికోవచ్చును. నన్నాలోచన యడిగితివా శుభస్యశీఘ్రమ్మని యుండుటచేత నేనీసాయంకాలమే ముహూర్తము పెట్టెదను. ఇది యెంత శీఘ్రముగా నయిన నంతమంచిది. ఈరాత్రియే సర్వము నివారణమయినపక్షమున జేపు నిర్విచారముగా నుండవచ్చును.

దామో—అవును. నీ వన్నమాట నిజమే.

పురు—నీవీలోపల నాకు వ్రాసినంగాని సాయంకాలములోపల నేను నిన్ను మరలఁ జూడను. నీశుభలేను నేనే కొనిపోయి నాహస్తముతోనే యాతనికిచ్చెదను. నీతో నేనొక్క రహస్యము చెప్పుచున్నాను. నీవునిర్వహింపవలసిన కార్యభారమువంటిదేయొకటి యిప్పుడు నాభుజములమీఁదఁగూడ నిలిచి యున్నది. పిరుఁ డయిన యొకానొక యౌవనపురుషుఁడు కొంతకాలమునుండి నాపౌరుషమును చులకనచేసి నన్ను గేలి చేయుచున్నాఁడు. అతనిని యుద్ధమునకుఁ బిలుచుటకయి యేదో యొకమిష పన్ని కలహము పెట్టుకోవలెను.

దామో—అట్లయినపక్షమున నీవు మునుగా యుద్ధము చేయుఁగా నాకు చూడవలెనని యున్నది. నీ వతనిని జంపుచుండఁగాఁ జూచి యుద్ధ మేలాగునఁ జేయవలెనో నేనింకను గొంచెము నేర్చుకోవలసి యున్నది.

పురు—నీకస్త్రవిద్యాగురువుననుట నాకును గౌరవమే. ఇప్పటికి నేను సెలవు పుచ్చుకొనెదను.—నీశత్రువు తారసించినప్పుడు నీ వెంతమాత్రమును వేగిరపడక సర్వమును శాంతతతోను నేర్పుతోను నిర్వహింపవలెను. నీమాట లెంత మృదువుగా నున్ననునీకత్తి వలెనే నీ వీరచేష్టలుమాత్రము వాఁడిగా నుండవలెను జుమా!

(ఇద్దఱును నిష్క్రమించు చున్నారు.)

చతుర్థాంకము.

౧. రంగము—దామోదరశర్మ గృహము.

[దామోదరవర్మయు, మాధవుఁడును ప్రవేశించుచున్నారు.]

మాధ—దేవుడితోడు ! నేను యెప్పుడు అటువంటిపని చెయ్యను. నాకు యిష్టంలేనప్పుడు వెయ్యిమంది పురుషోత్తమదేవుళ్లు చేరినా నాచేత పోట్లాడించలేరు. ఈసంగతి వింటే మాముసలావిడే మంటుంది?

దామో—ఓమాధవా ! ఏమనుకొన్నావు ? పురుషోత్తమదేవునిమాటలు విన్నపక్షమున నీకుఁగూడ నెక్కడిలేనిశౌర్యమును పుట్టుకొనివచ్చును. అతనిమాటలలోనుండి నిప్పులు కురిసినవి.

మాధ—నాకు శౌర్యం పుట్టించడానకి అతనిచేతగాదు. అటువంటి ఖజ్జాకోరుల మాట లంటేనే నాకు తలనొప్పి. మీకు పోట్లాడవలె నని వుంటేమాత్రం నేను వద్దని చెప్పను. నేనుమాత్రం మీపోట్లాటలో కాలుపెట్టను.

దామో—మాధవా! నాగౌరవమునకు భంగము వచ్చును. నా గౌరవమునుమాత్ర మెట్లయినఁ గాపాడుకోవలెను.

మాధ—నా గౌరవం నేనూ కాపాడుకోవలెను. మొట్టమొదటనన్ను నేను కాపాడుకుంటేనే కాని గౌరవం నిలువదు.

దామో—తగు మనుష్యుఁ డెవ్వఁడును తన గౌరమును పోఁగొట్టుకొనుట కెప్పుడు నిష్టపడఁడు.

మాధ—తగుమనిషి యెప్పుడూ గౌరవాన్ని పోఁగొట్టుకోవడానికి యిష్టపడక పోయినట్టయితే తగు మనిషిని పోగొట్టుకోవడానికి గౌరవం కూడా యిష్టపడకుండా వుండవలెను. అలా చెయ్యకపోయిన

ట్టయితే గౌరవం యను స్నేహితుడివలె నటించి మిత్రద్రోహంచేసిన దవుతుంది. తగుమనిషినని నన్ను యెవరూ అనకపోయినా లోకంలో నాకంటె తగుమనిషి యెవరూ లేరు. నాగౌరవంనన్ను మరివకపెద్ద మనిషితో పోట్లాడుమని బోధిస్తుంది, దాని బోధప్రకారం నేను పోట్లాడుతాను. ఆపోట్లాటలో నేను గెలిచి నాశత్రువును చంపినట్టయితే, అప్పుడాలాభం యెవరికి వస్తుంది? నాగౌరవానికివస్తుంది. ఒకవేళ నేనేవోడిపోయి నా శత్రువే నన్ను చంపినట్టయితే, అప్పుడు నాగౌరవం నన్ను నేలపాలుచేసి విడిచిపెట్టి నాశత్రువువద్దకు పరుగెత్తుతుంది.

దామో—మాధవా! నీ వాలాగున ననరాదు. అట్టి సమయములో నీశరీరము పోయినను భూమిమీఁద శాశ్వతముగా నీపేరు నిలుచును. నీవు స్వర్గమునకు పోయినను నీగౌరవ మక్కడకే నీ వెంట వచ్చును.

మాధ—అట్టి గౌరవం నాకక్కరలేదు. నన్ను స్వర్గానికి పంపి నావెంటబడే గౌరవాన్ని నేను యెప్పుడూ కోరను.

దామో—నీవు వట్టి పిఱికిపందవు. నాకుఁగల పౌరుషమునకు నీమాటలు వినుటసహిత మనర్హము. నీమాటలు విని మాపూర్వుల పౌరుషమునకుఁగూడ నేను భంగము తెత్తునా? భీరుత్వముచూపుట మాపెద్దల కెంత యవమానకరమో యాలోచించు.

మాధ—వారి కంత యవమానకరంగా వుండేటట్టయితే నాలుగు కత్తిపోట్లూ రెండుగుండుదెబ్బలూ తిని శీఘ్రంగా వారి లోకానికివెళ్ళి వారి అవమానం తీర్చండి. మాపూర్వు లటువంటి వాళ్ళుకారు. నేను వేగిరం వారిదగ్గిరకు వెళ్ళకపోతే వారికవమానం లేదు. నేను సాధ్యమయినంతకాలం యీలోకంలోనే వుండి నేను

వారి దగ్గిరకు వెళ్ళకుండా తప్పించుకుంటాను. నేను తమ దగ్గిరకు రాకుండా యిక్కడ వుండడమే వారికిష్టం.

దామో—మాధవా! యుద్ధము భయంకర మైనదని నీవనుకోకు. లోకములో ననేకులు నిరపాయముగానే యుద్ధముచేయుదురు సుమా!

మాధ—అటువంటివాడు యెక్కడనో నూటికీకోటికీవొక్కడు వుంటాడు. యుద్ధం పేరు చెపితేనే నాకు భయం వేస్తూవున్నది. పెద్ద కత్తీ వాడూ చేతిలో తుపాకీ పట్టుకుని శత్రువు యెదుట నిలవబడితే నా కసలే ప్రాణాలు నిలువవు. ఆపాడుపేరు నాతో చెప్పకండి. చిన్నప్పటినుంచీ నాకు కత్తిపేరంటేనే వళ్ళు వణుకుతుంది.

దామో—నా కటువంటి భయములేదు. కత్తులు! తుపాకులు! ఈమాటలు రెండును నాచెవుల కెంతో యింపుగానున్నవి. నీవెంత పిరికి మందు వేసినను భయమన్నది నా దేహములో పుట్టదు. ఇదిగో యుద్ధమునకు రమ్మని నేను నాశత్రువునకు వ్రాసిన యాహ్వానపత్రిక. నాపక్షమున పోయి యుద్ధమునకు రమ్మని యెదుగుటకయి నా ప్రాణస్నేహితు డయిన విక్రమసేనునికిఁగూడ వర్తమాన పంపినాను.

మాధ—యీ యుత్తర మాయన తీసుకుని పోవలసినదే. నా యెత్తు ధనం గుమ్మరించినా నేనుమాత్రము పోను. ఈ వుత్తరం చూస్తే మామూలు వుత్తరాలలాగు కనపడడంలేదు. ఈవుత్తరం లోనుంచి దూరాన్నుంచే నాముక్కుకు తుపాకిమందు వాసనా కత్తుల వాసనా కొడుతూవున్నది. అది యెగిరివచ్చి నామీద పడదుగదా?

దామో—ఓరి దౌర్భాగ్యుఁడా! నీకు లేడిపిల్ల కున్నంత ధైర్యమైన నున్నట్టు కనఁబడదే?

మాధ—యిక నేను మాట్లాడను. ఈరాత్రి యింటివద్ద యేదో పాడుమాట వింటాను. ఆమాట చెవినిబడ్డప్పుడు ముసలావిడ యెంత దుఃఖస్తుందో! అయ్యో!

(అని హీనస్వరముతో నేడ్చుచున్నాఁడు.)

దామో—నోరు మూసికో. నీవెంత యేడ్చినను నా పూనిక నేను విడువను. నే నీదినమున యుద్ధము చేయవలె నని నిశ్చయము చేసికొన్నాను. ఓ పిఱికిపందా! నాయెదుటనుండి లేచిపో.

[మఱియొక సేవకుఁడు ప్రవేశించుచున్నాఁడు.]

సేవ—విక్రమసేనుడుగారు వచ్చినారండి.

దా.మో—ఆయనను పయికి దయచేయ మను.

సేవ—చిత్తము. (అని పోవుచున్నాఁడు.)

మాధ—మనసందరినీ దేముడు రేపీపాటికి ప్రాణాలతో వుంచవలెను.

దామో—ఆయేడు పేమి? మాధవా! నాకు కోపము తెప్పింపకు.

మాధ—శమవద్ద యిదే ఆఖరుశెలవు. (అని వెక్కి వెక్కి యేడ్చు చున్నాఁడు.)

దామో—ఓపిఱికిపశువా! నీయేడుపు చాలించి తక్షణము నావద్దనుండి లేచి పో.

మాధ—పోతాను. (అని నిష్క్రమించుచున్నాఁడు.)

[విక్రమసేనుఁడు ప్రవేశించు చున్నాఁడు.]

విక్ర—దామోదరా! ఇది యేమి?

దామో—వీఁడు పనికిమాలినపిఱికిపీనుఁగు. నాకేమేరుపర్వతమును మీఱినధైర్యము లేకపోయినపక్షమున—

విక్ర—నా కెందుకు వర్తమానము పంపినావు?

దామో—ఇదిగో! చూడు. (అని యుద్ధాహ్వానపత్రికను చేతి కిచ్చుచున్నాఁడు.)

విక్ర—(చూచి చదువుచు తనలో) "విజయపాలునకు"—ఇప్పు డేదో వినోదము నడుచు చున్నది. (ప్రకాశముగా) యేమిటిది?

దామో—యుద్ధాహ్వానపత్రిక.

విక్ర—అలాగా? అతనితో యుద్ధము చేయువాఁడవు నీవు కావు కాఁబోలును! అవునా?

దామో—కాదు. నేనే యుద్ధము చేసెదను. పురుషోత్తమ దేవుఁడు నన్ను ప్రోత్సాహపఱిచి యుద్ధమునకు నాకు పౌరుషమెక్కించి నాఁడు. అతఁడు నన్ను విడిచి పోవునప్పటికి నాలోపల మితిమీఱిన యాగ్రహము ప్రవేశించినది. అటువంటియాగ్రహము వచ్చినప్పుడు దానినూరక పోనియ్యరాదు. నేనీసాయంకాలము యుద్ధము చేసెదను.

విక్ర—అవునుగాని యిప్పుడిందులో నాపని యేమున్నది?

దామో—ఆవిజయపాలునిగూర్చి నీకు కొంత తెలిసియుండ వచ్చును. నీవు పోయి వానిని కనుఁగొని నాకు మాఱుగా నీవీప్రాణాపాయకర మయినయాహ్వానపత్రిక నాతని కియ్యవలెను.

విక్ర—నాచేతికిచ్చి యిది యతనికి ముట్టినట్టే భావించుకో.

దామో—నీవు చేసినయుపకారమునకు నేను నీమేలు మఱచి పోను. మిత్రుఁడా! నీకు నేను మిక్కిలి శ్రమ కలుగఁజేయుచున్నాను గదా!

విక్ర—నాకెంతమాత్రమును శ్రమ లేదు. ఈమాట నీవు మఱియెవరివద్దను తలపెట్టఁబోకు. నామాట నమ్ము. నేను నీపని శ్రమగా నెంచుకోను.

దామో—నామీఁద నీ కనుగ్రహ మున్నది గనుక స్నేహ ధర్మ మనఁగా నిదేకదా! విక్రమసేనా! నీవు నాకు సహాయుఁడవుగా నుండఁగలవా?

విక్ర—ఈవ్యవహారములో మాత్రము నే నుండఁగూడదు. ఇందులో నే నుండుట యుక్త మయినపని కాదు.

దామో—అట్లయినపక్షమున నేను నామిత్రుఁ డయినపురు షోత్తమదేవుని నే కోరవలెను. అయినను నీవు నాక్షేమమునయినను కోరుచుండవలెను.

విక్ర—అతఁడును నీవును గలిసికొన్నప్పుడు మఱి యెవ్వరి క్షేమమును గోరను. నామాట నమ్ము.

[సేవకుఁడు ప్రవేశించు చున్నాఁడు.]

సేవ—వీరసేనుఁడుగారు కిందికివచ్చి యిక్కడ విక్రమసేనుఁడు న్నాడేమో కనుక్కొని రమ్మన్నారు.

విక్ర—ఇదిగో వచ్చుచున్నానని చెప్పు.

సేవ—చిత్తము. (అని పోవుచున్నాఁడు.)

విక్ర—(వెళ్లుచు) ఓ రణశూరా! నీకు జయము కలుగునుగాక!

దామో—విక్రమసేనా! నిలువు ఒక్కనిమిషము తాళు. నీ స్నేహితుఁ డైనదామోదరవర్మ యెటువంటివాఁడని విజయపాలుఁడు నిన్నడిగినపక్షమున, అతఁడు ప్రత్యక్షరాక్షసుఁ డని చెప్పవలెను. ఆలాగునఁ జెప్పెదవు కాదా?

విక్ర—నిశ్చయముగా చెప్పెదను. ముక్కుకండలు కొఱికెడు మహావ్యాఘ్రమని చెప్పెదను.

దామో—ఆలాగు చెప్పు. ఆమాటలతోనే యతఁడు భయ పడినపక్షమున, అతఁడు యుద్ధమునకే రాకపోవచ్చును. నేను శత్రు

వుదు వారమునదినములు బాధపెట్టి మఱి చంపుదు నని చెప్పు. మఱచి పోకుమా!

విక్ర—మఱచిపోను. నాఁటను నిన్నందఱు వసహాయశూరుఁ డని చెప్పుకొందు రని చెప్పెదను.

దామో—ఈపేరు సరి. ఇది యంతయు ప్రాణాపాయము కలుగకుండుటకయి చెప్పినదే కాని మఱియొకటి కాదు. నాగౌరవము నిలువుకోఁ గలిగినపక్షమున, అతని ప్రాణముల కలుగుట నా యిష్టము కాదు.

విక్ర—కాదు. నీవు మహోదయార్ద్రహృదయుఁడవు.

దామో—అతనిని నేను చంపవలెనని నీ కోరిక. కాదుగదా!

విక్ర—కాదు కాదు. అయినను నీవు ప్రత్యక్షరాక్షసుఁడవు. అవునా! (అని పోఁ బోవుచున్నాఁడు.)

దామో—అవు నవును. విక్రమసేనా! ఇంకొక్క క్షణకాల మాగుము. నీ వెఱిఁగినతరువాత నా కింత యాగ్రహ మెన్నఁడును రాలే దని చెప్పు. కంటఁబడఁగానే మ్రింగివేయునంత కోపము వచ్చిన దని చెప్పుము.

విక్ర—తప్పక చెప్పెదను.

దామో—ముక్కు కండలు కోఱికెడు పెద్దపులి యన్నమాట మఱచి పోయెదవు సుమా!

విక్రి—మఱచిపోను. నీ వసహాయశూరుఁడ వని కూడ చెప్పెదను. (ఇద్దఱును నిష్క్రమించుచున్నారు).

౨ రంగము—సుభద్రమ్మగారి యిల్లు.

[సుభద్రమ్మయు, కళావతియు ప్రవేశించుచున్నారు.]

సుభ—ఓమూర్ఖురాలా! అతని విషయమయి నీకుఁగల యాక్షేపణ మేమోనాకు చెప్పు. అతఁడు సౌందర్యవంతుఁడు కాఁడా?—ఏమి? మాటాడవేమి? అతఁడు రసికవరేణ్యుఁడు కాఁడా? పురుషాగ్రగణ్యుఁడు కాఁడా?

కళా—(తనలో) ఈమె తాఁనిప్పు డెవరిని స్తుతించుచున్నదో కొంచెమయిన నెఱుఁగదు. (బిగ్గరగా) అత్తా! విజయపాలుఁడు నట్టివాఁడే.

సుభ—పోలికలు చెప్పరాదు. ఒకరితో నొకరిని పోల్చుట పడుచుదాని కెప్పుడును కూడనిపని. విక్రమసేనుఁడు నిశ్చయముగా రసికాగ్రగణ్యుఁడు.

కళా—(తనలో) నీవు చూచిన విక్రమసేనుఁడు కాఁబోలును!

సుభ—అతఁడు మంచి గురుజనశిక్షలో పెరిగినవాఁడు. అతని వినయమేమి? వాఙ్మాధుర్యమేమి? రూపరేఖావిలాసములేమి! మొట్టమొదట నే నతని ముఖమును జూడఁగానే ప్రబంధములలో వర్ణింపఁబడెడు మన్మథుఁడు నాకప్పుడు స్మరణకు వచ్చినాఁడు.

కళా—(తనలో) క్షణకాలములో తాను పడిన భ్రాంతిని కనుగొన్న తరువాత నీమె యప్పు డెంత కోపపడునో!

[సేవకుఁడు ప్రవేశించుచున్నాడు.]

సేవ—అమ్మా! వీరసేనుఁడుగారును విక్రమసేనుఁడుగారును వచ్చి క్రింద నిలిచియున్నారు.

సుభ—పై కిక్కడకు రమ్మను.

సేన—చిత్తము. (అని పోవుచున్నాఁడు.)

సుభ—కళావతీ! నీవిప్పుడు బుద్ధిమంతురా లయిన కన్యకు తగినట్టుగా నడుచుకోవలెను. నాయెడలఁ జూపవలసిన విధేయతను మఱచిపోయినను నీవధమపక్షము పెద్దశిక్షలో పెరిఁగినదాన వయినట్టయినను మంచిమర్యాద చూపవలెను.

కళా—అత్తా! నామనోనిశ్చయ మేమో నేనీవఱకే నీకుఁ దెలిపియున్నాను. అతనికి నే నిప్పు డాశచూపి ప్రోత్సాహవాక్యములు పలుకక పోవుటయే కాక యతనితో నే నిప్పుడు నోరువిప్పి మాటాడ నైనను మాటాడను; అతనివంక చూడ నైనను జూడను.

(అని మొగము త్రిప్పుకొని తలవంచుకొని కూరుచున్నది.)

[వీరసేనుఁడును విక్రమసేనుఁడును ప్రవేశించుచున్నారు.]

వీర—సుభద్రమ్మా! ఇదిగో మేము వచ్చినాము. నీ విటు వచ్చి నిర్దయురా లయిన యీసుందరియొక్క కోపదృష్టిని కొంత శాంతిపఱుచు. వీనిని మనమార్గమునకు తెచ్చుటకు నే నెంత కష్టపడినాను. వీనిలోపల నేమున్నదో నాకు తెలియదు. నేను నిర్బంధము నుపయోగపఱచక పోయినపక్షమున. వీఁడును తప్పించుకొని జాఱి పోయెడివాఁడే.

సుభ—వీరసేనా! మీరీవ్యవహారములో నపరిమిత మయిన శ్రమ పడినారు. మీకు వృథాశ్రమ కలుగఁజేసినందుకు నాకు సిగ్గగుచున్నది. (కళావతితో మెల్లఁగా) కళావతీ! కళావతీ! నిన్ను బతిమాలుకొనుచున్నాను. లే లే. తలయెత్తిచూచి వీరిని గారవించు.

వీర—సుభద్రమ్మా! వీనియొక్క యోగ్యతను గూర్చియు మేనత్తకుదిర్చిన సంబంధమునందుఁ జూపవలసిన గణ్యతనుగూర్చియు

నాతోడి బంధుత్వ గౌరవమును గూర్చియు కళావతి తనలో తాను చక్కఁగా నాలోచించుకొన్నదని నమ్ముచున్నాను. (విక్రమసేనునితో మెల్లఁగా) విక్రమా! ఆచిన్నదానిని పలుకరించి మాటాడు.

విక్ర—(తనలో) ఓయి దేవుఁడా! నాకిప్పు డేమిచేయుటకును తోఁచకున్నది. (వీరసేనునితో రహస్యముగా) అయ్యా! మీరును చూచుచున్నారుగదా! ఆచిన్నది మీయెదుట నా మొగమువంక చూడనైనను చూడకున్నది. ఆచిన్నది నన్ను కన్నెత్తి చూడదని యెఱిఁగినవాఁడ నయి తమతో ముందుగానే మనవిచేసియున్నాను. మీరు దయచేసి మాయిద్దఱిని నొంటిగా విడువవలె నని నాప్రార్థన.

(అని బతిమాలుకొనుచున్నాఁడు.)

కళా—(తనలో) నామేనత్త యెందుచేతనో యింకను తన యద్భుతమును తెలుపకున్నది! ఈమె యతని ముఖము నింకను నిశ్చయముగాఁ జూచి యుండలేదు. ఒకవేళ నుద్యోగస్థు లందఱును నొక్కపోలికగానే యుందురు కాఁబోలును! లేదా, ఈమె దృష్టిలో నేమయిన లోప మున్నదేమో!

వీర—ఇప్పు డప్పుడే మిమ్మొంటిగా విడిచి నే నడుగు దూర మైనను పోను.

సుభ—వీరసేనా! నామేనకోడలు నామాటయం దంతగౌరవ ముంచునది కాదని చెప్పవలసినందుకు చింతిల్లు చున్నాను—(కళావతితో మెల్లఁగా) కళావతీ! ఈవైపు తిరుగు. నీమౌర్ఖ్యము చూచి నేను లజ్జపడు చున్నాను.

వీర—కళావతి నాకుమారుని లభిలషింప నొల్లకుంచుట కారొ పించు కారణ మేదో తెలిసికొనుభాగ్యము నాకు లభించునుగాక! —

(విక్రమసేనునితో మెల్లఁగా) విక్రమా! ఆరంభింప వేమి? ఓరి గాడిదా! మాటాడు.

సుభ—వీరసేనా! కారణ మూహించుట దీనికి సాధ్యము కాదు. కారణ మున్నదని కళావతి చెప్పను.—(కళావతితో రహస్యముగా) ఓ ముద్దరాలా! అడిగినదాని కుత్తరము చెప్పు సదుత్తరము చెప్ప వేమి?

వీర—సుభద్రమ్మా! కారణము లేనియీ చిన్నతనపు వేగిరపాటువలన మా విక్రముని సౌఖ్యమునకు భంగము కలుగ దని నేను నమ్ముచున్నాను.—(విక్రమసేనునితో రహస్యముగా). ఓరి మొద్దా! మాటాడ వేమి?

కళా—(తనలో) మాటాడుటకు నా కెంత యిష్ట మున్నదో నా కాముకునకు నంతే యిష్ట మున్నట్లు కనఁబడుచున్నది.—నా మేనత్త యెంత గుడ్డిదిగా నున్నదో!

విక్ర—ఓ-ఓ-కన్యా! ఓ—(మాటాడవలెనని ప్రయత్నించి వీరసేనునివంక తిరిగి) నేను తొందరపడుచున్నాను. నాకు తత్తఱపాటు కలుగుచున్నది. ఇట్లు సంభవించునని నేనీవఱకే యెఱుఁగుదును. నేను ముందుగానే తమతో మనవి చేసినాను. నాకుఁ గలమోహాతిశయము నాహృదయస్థైర్యమును పోఁగొట్టుచున్నది.

వీర—అది నీహృదయస్థైర్యమును పోగొట్టినది కాని నీనోటిమాటను పోఁగొట్టలేదుగదా! ఓరిబుద్ధిహీనుఁడా! ముందుకుపోయి యాచిన్నదానితో తిన్నఁగా మాటాడు.

విక్ర—ఆచిన్నదానితోనా? (తమ్ము విడిచి పొమ్మని సుభద్రమ్మకు సైగ చేయుచున్నాఁడు.)

సుభ—వీరసేనా! ఇక్కడ వీరనిద్దతిని విడిచి కొంచెముసేపు మన మావలికిఁ బోదమా?—(కళావతితో మెల్లఁగా) ఓసి మంకు నిర్భాగ్యురాలా!

వీర—ఇప్పు డప్పుడే కాదు.—(విక్రమసేనునితో మెల్లఁగా) నీకు దయ్యము సోఁకినదా యేమి? నీనోటితాళము విప్పు.

విక్ర—(తనలో) ఈశ్వరానుగ్రహమువలన కళావతి నావంకతిరిగి చూడక కోపముతో మూతిముడుచుకొని యుండును గాక! నేను మాఱుగొంతుకతో మాటాడవలెను. (కళావతి చేరువకుఁ బోయి హీనస్వరముతో) కామప్రేరితమైన యీసుస్వరమును కళావతి యొక్కసారి చెవియొగ్గి విన ననుగ్రహింపదా?

వీర—దయ్యము పట్టుకొని నీగొంతు నొక్కుచున్నదా యేమి? నోరు తెఱచి స్పష్టముగా మాటాడ వేమి? గుంటలో గోదురుకప్ప లాగున మూలుగుచు నిలువఁబడకు.

విక్ర—నా—నా—నాగామోద్రేకమువలనను, నా—నా—నా సిగ్గువలనను, నా—నా— నానోటినుండి మాట పయికి రాకున్నది.

వీర—ఓహోహో! పోయినసిగ్గు నీకు మరల వచ్చినదే! విక్రమా! నామాట విను. నీవు వెంటనే తిన్నఁగా స్పష్టముగా బిగ్గరగా మాటాడనిపక్షమున, నాకు కోప మాగదు సుమా!— ఓ సుభద్రమ్మా! ఇంతటితో తన నేలచూపులు మాని నీమేనకోడలి నొక్కసారి మాయం దనుగ్రహించి యీవంక తిరుగుమను.

సుభ—కళావతీ! ఇటు తిరుగు. (అని మందలించుచున్నది.)

విక్ర—(తనలో) ఇఁక సర్వమును బయలుఁబడక మానదు—(కళావతి చెంతకుఁబోయి మెల్లఁగా) ఓప్రియురాలా! కళావతీ! వింత

పడఁబోకు. కొంచెముసేపు నీ యద్భుతమును నీ మనస్సులోనే యడఁచుకో.

కళా—(తనలో) ఓయీశ్వరుఁడా! ఈకంఠస్వరము విజయపాలునిదే. ఇతఁడు నిశ్చయముగా వీరసేనునిగూడ మోసపుచ్చి యుండనేరఁడుగదా! (అని మెల్లఁగా కన్నులువిచ్చి చుట్టును జూచి యులికిపడి) ఆహా! ఏమి నాకన్నుల కింతభాగ్యము పట్టునా? ఓవిజయపాలా! విజయపాలా! ఇది స్వప్నమా? సత్యమా? ఏమి యీ యాశ్చర్యము!

విక్ర—(తనలో) అక్కటా! అంతయు మాఁగిసిపోయినది.

వీర—విజయపాలుఁడా? ఎక్కడి విజయపాలుఁడు? ఈచిన్నదానికి మతిభ్రమ కప్పినదా యేమి? వీఁడు నాకొడుకు విక్రముఁడు.

సుభ—ఇది సిగ్గులచేటు. వట్టిసిగ్గులచేటు. ఓసివివేకహీనురాలా! నీమన స్సెప్పుడును విజయపాలునిమీఁదనే యుండుటచేత నీ కన్నుల కెప్పుడును సర్వమును విజయపాలమయముగానే కనఁబడుచున్నది. విక్రమసేనునికి క్షమార్పణము చేసికో.

కళా—ఇక్కడ నాప్రాణేశ్వరుఁడైన విజయపాలుఁడు దక్క నాకంటి కేవిక్రమసేనుఁడును కనఁబడుచుండ లేదు.

వీర—సందేహము లేదు. ఈచిన్నదానికి పిచ్చి యెత్తినది. చదువతివిస్తారమగుటచేత మతిపోయిన ట్టున్నది.

సుభ—నాకును నట్లేతోఁచుచున్నది. ఓసి మతిహీనురాలా! విజయపాలుఁ డన్నమాటకు నీయభిప్రాయమేమి? నీవీవఱకే విక్రమసేనుని జూచి యున్నావు. అదెవచ్చి యతఁ డిప్పుడు నీయెదుట నిలువఁబడి యున్నాఁడు. అతఁడే నీకు భర్త కాఁగలవాఁడు.

కళా—ఇతఁడు భర్తయగుటకు నా కాక్షేపణ యేమియు లేదు. నావిజయపాలుని నేను నిరాకరింతునా?

వీర—నీమేనకోడలికి మతిభ్రమించియైన నుండవలెను; లేదా వీఁడు మాయవేషము వేసి మనలను మోసముచేసియైననుండవలెను ఓరీ! ఇటు రా. నీ వెవఁడవు?

విక్ర—నాస్థితి నాకే తిన్నఁగా బోధపడకున్నది. నే నెవ్వఁడనో స్మరణకుఁ దెచ్చుకొని చెప్పెదను.

వీర—నీవు నాకొడుక వవుదువా కావా? ఓరి గాడిదా! వేగిరము చెప్పుము.

సుభ—నీ వెవరో శీఘ్రముగా చెప్పుము. ఇప్పుడు నాకును సంశయము కలుఁగు చున్నది.

విక్ర—(తనలో) ఓయువివేకదేవతా! నీవు నాకు సహాయపడుము. (బిగ్గరగా) అయ్యా! నేను మీకుమారుఁడనే సందేహింపనక్కఱలేదు.—ఓసుభద్రమ్మా! నే నెప్పుడును నీసుఖసంతోషములను గోరువాఁడనయి యుండి యిప్పుడు నీ మేనకోడలికి భర్తనయి నీతోడిబంధుత్వగౌరవము పొందఁగలుగుటకు గర్వపడు చున్నాను. తానిప్పుడు చూచుచున్నది తనప్రియవల్లభుఁ డయినవిజయపాలుని నే యని నేనిప్పుడు నాకళావతితో వేఱుఁగ జెప్పనక్కఱలేదు. ఈచిన్నదానియొక్క మనోగతవిశేషమును గుర్తెఱిఁగినవాఁడనయి యీమెకు మనస్సంతుష్టి కలుగుటకయి నేనా వేషభాషలను స్థితిగతులను ధరించి యీమెమనస్సుయొక్క నైర్మల్యమును శోధించినాను. ఈమె నిర్మలహృదయము నాపరీక్షకాగి తనయవ్యాజప్రేమను దృఢపఱిచినందున, ఇక నే నారోపించుకొన్న నీచవేషధారణమును నామధారణమును

విడిచి స్వవేషముతో నున్నతస్థితిని బొంది మాయావ్యాజానురాగము యొక్క ఫలమును స్థిరముగా ననుభవింపఁ గాంక్షించుచున్నాను.

కళా—అలాగునవా? (కోపముతో) అట్లయినపక్షమున నింక నే ననుకొన్న ట్లిల్లు విడిచి లేచిపోవుట లేనేలేదా?

వీర—విక్రమా! నీవు నిశ్చయముగా మటుమాయలమారివి. నాకుఁ జూడఁగా నీవందఱినిమించిన నెఱజాణవుగాఁగనఁబడుచున్నావే?

విక్ర—నన్నూరక మీరు పొగడుచున్నారు. అంత గౌరవమునకు నేను తగను. ఆత్మశ్లాఘన వినుటకు నాకు సిగ్గగుచున్నది. నాస్వభావము దేవరవారు నెఱుఁగుదురుకదా! మొదటినుండియు నా సిగ్గే నన్ను చెఱుపుచున్నది.

వీర—మంచిది. మొట్టమొదట నటించినట్లు నీవు కేవల జడస్వభావుఁడవు కావని తెలిసికొనుటచేత నాకు సంతోషము కలుగుచున్నది. ఓరిగాడిదా! నీవు నీకన్నతండ్రినే వంచించినావుగదరా! నీపశ్చాత్తాపమును, సుతధర్మమును, విధేయతయు, ఇవే కాఁబోలును! అంత యాకస్మికముగా మనస్సు మార్చుకొనుట చూచి నే నిప్పుడే యనుమానపడినాను. వీరిపేరు లెప్పుడును విన్నట్టే నీకు జ్ఞప్తిలేదు కాదా? భీమవరములో నుండెడుకళావతి అవునా? నామనస్సు సంతోషపెట్టుట యొక్కటియే నీకుఁ గావలెనుగాని నీ కితరముతో దేనితోను పనిలేదుకాదా? ఔరా! నీ వెంత మాయలమారి దొంగవురా! చూడు. (అని వ్రేలితో కళావతిని జూపుచు) ఈచిన్నదానిది మెల్లకన్ను. అవునా? కొంచెము రాగివెంట్రుకలు. అవునా? ఓరి జిత్తులమారినక్కపోతా! నీ విప్పుడు తలయెత్తుకొనుటకుఁగూడ సిగ్గుపడకున్నావు!

విక్ర—నాకు నలుగురిలో తలయెత్తుకొనుటయే యెంతో

కష్టముగానున్నది. నామనస్సంతయు కలతనొందినది. నారూపము చేతనే నామతి చెడినట్టు మీరు తెలిసికోవచ్చును.

సుభ—వీరసేనా! ఇప్పుడు క్రొత్తక్రొత్తవింతలు బయలఁబడు చున్నవి. ఓహో! విక్రమసేనా! అట్లయినయెడల, ఈయుత్తరములు వ్రాసినవాఁడవును నీవేకదా? ముసలిపిశాచ మని నాకు బిరుదు పేరిచ్చినందునకయి నీయెడల నేను కృతజ్ఞురాలనయి యుండవలెను. ఓయిభగవంతుఁడా! నాపాండిత్యవిషయమయి గేలిచేసినదికూడ నీ ఘనుఁడేకదా?

విక్ర—అయ్యో! మీరిప్పుడు నాకడ్డుపడి నన్ను రక్షింపక పోయినపక్షమున నాసిగ్గు నన్ను బ్రతుకనీయదు. ఈలజ్జాభరమునకు నేను తాళఁజాలను.

వీర—సుభద్రమ్మా! మనము పోదము రా. వెనుకజరిగిన దానిని సర్వమును మఱచిపోయి మనము వీరిని క్షమింపవలెను. ఇప్పుడు మన ముద్దేశించినట్లు సర్వమునను కూలముగాముగిసినందున, నే నిప్పుడు కోపము వహించి సంతోషభంగము చేయఁజాలను. సుభద్రమ్మా! నీవో?

సుభ—వీరసేనా! మీరన్నట్టు గతమును మనమిప్పుడు తల పెట్టఁగూడదు. ఈపసివాండ్రి చిన్నతనపుచేష్టలను లక్ష్యముచేయక మనము ముందుసంగతి యాలోచించవలెను.

వీర—వీరినిద్దఱిని దిగవిడిచి మనము పోదము రా. మనము కాలు కదల్పఁగానే వీరిద్దఱు నొండొరుల కౌఁగిళ్ళలోఁ బెనఁగవలె నని తమకపడుచున్నట్టున్నారు. మన మిక్కడనుండి రసభంగము చేయ రాదు, పోదమురా. విక్రమా! ఈమె కన్నులు నేను చెప్పిన ట్లున్నవా? చెక్కులో? నవ్వు మొగమో? పలువరుసయో? సుభ

ద్రిమ్మా! లే. వీరి కిది సంతోష సమయము. నేనిప్పుడు నా సంతోషము పట్టజాల కున్నాను. మన మావలికిఁ బోయి నవ్వు కొందము రా. (అని పాడుచు సుభద్రమ్మను చేయిపట్టుకొని లాగికొని పోవుచున్నాఁడు.)

కళా—(మొగము ముడుచుకొని మాటాడక కూరుచున్నది)

విక్రి—(తనలో) ఈమె దీర్ఘాలోచన చూడఁగా నాకు శుభ సూచకముగా తోఁచదు. (బిగ్గరగా) నాప్రాణేశ్వరీ! కళావతీ! అంత గంభీరముగా నాలోచించుచున్నా వేమి?

కళా—ఏమి?

విక్రి—(తనలో) ఇంతవఱకు వచ్చునని నే నప్పుడే యను కున్నాను. "ఏమి" అన్న యాచిన్నపదము నాగుండెలు పగుల్చు చున్నది. (బిగ్గరగా) కళావతీ! మన మొండొరులము చేసికొన్న ప్రమాణమువలననే కాక యిప్పుడు మన పెద్దవారి యనుమతి వలనఁ గూడ సుఖభాజనుల మయి ధన్యులము—

కళా—(కోపముతో) పెద్దవారి యనుమతి వలననా? అవును!

విక్రి—ప్రియురాలా! మనము తలపెట్టిన సాహసకార్యము నకు విశ్రాంతి కలిగినది. తుట్టతుద కిప్పుడు సుఖకాల మాసన్న మయినది. అనుభవింతము రా. నీసొత్తు విషయ మయి తరువాత న్యాయవాదులను—

కళా—న్యాయవాదులా? న్యాయవాదియన్న పేరు చెప్పిన నాకు తలనొప్పి.

విక్రి—పోనీ. న్యాయవాదుల నడుగనక్కఱలేదు. మనలో మనమే లిఖితము—

కళా—లిఖితమా? లిఖితమన్న పేరే నాకు పనికిరాదు.

విక్ర—ఓ ప్రాణేశ్వరీ! నీ కింకరునియెడల నిర్దయత్వము వహింపఁబోకు. నీ యడుగులమీఁద వ్రాలి ప్రార్థించుచున్నాను.

(అని పాదములమీఁదఁ బడుచున్నాఁడు.)

కళా—లెమ్ము. నేను నీ సొమ్మగుదునని నీవు నిశ్చయముగా నెఱిఁగియున్నప్పుడు పాదములమీఁదఁ బడవలసినపని యేమున్నది?

విక్ర—(లేచి) ఓ కాంతా! నీ స్వాంతమున కంత నిర్బంధ మక్కఱలేదు. నీ హృదయము నన్ను విడిచినపక్షమున, తక్కినవానిని నేనపేక్షింపను. (తనలో) నే నిప్పుడు కొంచెము బెట్టుచేసి చూచెదను.

కళా—(లేచుచు) నా మనస్సులో నున్నది స్పష్టముగాఁ జెప్పెదను విను. నీవు నీ కార్యమును నీచమగు పౌరుషహీన మయిన వంచనచేత సాధించుకొన్నావు. అందుచేత మోసముచేసిన శిక్షకు నీవర్హుఁడవు. నా హృదయదౌర్బల్యమును కనిపెట్టి నన్ను నీవు పిల్లదాని నాడించిన ట్లాడించుచున్నావు. నీలోనీవు నన్నుఁజూచి నవ్వుచు నీవు పొందిన విజయమునకు సంతోషించుచున్నావు కాఁబోలును!

విక్ర—కళావతీ! లేనిదోష మారోపించి యిప్పుడు నీవు నాయెడ నపచారము చేయుచున్నావు. నేను చెప్పునది సాంతముగా విని—

కళా—నా బంధువుల నందఱిని మాయ చేయుచున్నా మను భ్రమలోనుండి, వారందఱి కన్నులు గప్పి తప్పించుకొని పాఱిపోయి వారికి కోపము తెప్పించి నా సామర్థ్యము చూపవలె నని నేను కొండంతయాశ పెట్టుకొని యుంటిని. అట్లుండఁగా నా మేనత్త యొక్క యంగీకారమువలనను సమాధానము వలనను నాయాశ యంతయు నిమిషములో భగ్న మయిపోయినది. వారిని మోసపుచ్చుటకు

మూలుగా తుద కిప్పుడు నే నొక్కతెనే మోసపోయిన దాన నయి నాను. (అని కోపోద్రేకముతో నడుచును, ఇదిగో పటము—విజయ పాలుని పటము. (పటమును అవికలోనుండి పయికిఁదీసి) న న్నెంద తెన్నివిధముల భయపెట్టుచున్నను దూషించుచున్నను లక్ష్యము చేయక యీ చిత్రపటమును నేనింత కాలము రేయింబగళ్ళు హృదయ మధ్యమున ధరించినాను. నీపట మిఁక నీవే పుచ్చుకొమ్ము. (అని మీఁద విసరివైచి) ఈ ప్రతిరూపమును నాహృదయమునుండి యెంత యనాయాసముగాఁ దీసివేయుచున్నానో యంత యనాయాస ముగానే దీనికి మూలమైన పురుషునిగూడ నేను నా హృదయములో నుండి తఱిఁమివేయఁ గలుగుదు నని నీవు నిశ్చయముగా నమ్ముము.

విక్రి—ఓ కాంతా! ఈవిషయములోనీకును నాకును భేదము లేదు. ఇదిగో కళావతియొక్క పటము. (అని పయికిఁదీసి) ఈప్రతి రూపమునకు నిజరూపమునకును నా కెంత వ్యత్యాసము కనఁబడు చున్నది! ఈదివ్యసుందర విగ్రహముయొక్క కలకలలాడుచున్న యీ నవ్వుమొగమే కదా మొట్టమొదట నన్నాశలపెట్టి నా హృద యము నపార సౌఖ్యానందసుధా రాశిలో ముంచినది! ఎన్నడునుతుడిచి వేయుట కసాధ్య మగునట్లుగా కామదేవుని పుస్తకములో శిలాక్షర ములతో వ్రాయఁబడియున్న శపథములను బలికిన వీచిన్న పెదవులే కదా! అవియన్నియు పూర్వపు గాథ లయిపోయినవి. అంతయు నిప్పుడు మరల మొట్టమొదటికి వచ్చినది. ఓ సుందరీ నీ నిరుపమాన సౌందర్యము ముందఱ నీ ప్రతిబింబ మంత చక్కనిదిగా నుండక పోయినను, నామనస్సునకు మాత్రము దీని మనోహరత్వములు దీని యందలి గౌరవమును దీని నిజరూపమునకంటె తక్కువ పడలేదు

గాన దీనిని నేనెడఁబాయఁజాలను. (అని మరల హృదయమున ధరించుచున్నాఁడు).

కళా—(కొంత శాంతతతో) ఇది యంతయు నీదోషమే. స్వయంకృతాపరాధమును దెలిసికొని నీవు తృప్తుఁడవయి యుండవచ్చును.

విక్ర—నిశ్చయముగా తృప్తుఁడనయినాను. ఇంతకంటె నీవు మొట్టమొదటనే ప్రేమ చూపి యాశపెట్టకున్న నెంతో బాగుండును. ఆహాహా! ఇది యెంత యయినను సరసముగా నున్నది. నూఱుల కొలఁదిబాసలుచేసి వానినెల్ల తప్పుట నీదృష్టికి గొప్పగా కనఁబడుచుండలేదు. ఆవాగ్దానములెల్లను నీదృష్టికి తృణప్రాయములయినవి. అయినను లోకులుమాత్రము కళావతి తనహృదయమునే తానెఱుఁగదని చెప్పకొనక మానరు. ఇతరులమాటలతో నీకేమిపని? లోకులొకవేళ తమదుస్స్వభావముచేత ప్రియుఁడు ప్రియురాలియొక్క యాదరము చూచి 'మొగము మొత్తి విడిచి పోయినాఁడని వాదు వేసినను వేయవచ్చును. ఆయుపవాదముసహితము నీమనస్సున కాయాసము తోఁపించకుండునుగాక!

కళా—ఈయవమానమును సహింపఁజాలను. (అని కన్నీరు పెట్టుకొనుచున్నది.)

[అంతట సుభద్రమ్మయు, వీరసేనుఁడును ప్రవేశించుచున్నారు.]

సుభ—బావా! రమ్ము. మనము కొంచెముసేపు వీరికామోన్మాదమునకును శృంగారప్రలాపములకును విఘ్నము కలుగఁజేయవలెను.

కళా—ఓనీచకృతఘ్నుఁడా! ఇది నీద్రోహమును వంచనమును మించి యున్నది. (అని పెద్దపెట్టున నేడ్చుచున్నది.)

వీర—ఇదేమి వైపరీత్యము? ఇది చూడఁగా నాకత్యద్భుతముగ నున్నది. సుభద్రమ్మా! ఇటువంటి కామోన్మాదమును శృంగార ప్రలాపములను నేనీవఱ కెక్కడను వినియు కనియు నుండలేదు. ఈరసాభాసమున కర్థమేమి? నాకు తెలియకున్నది.

విక్ర—ఈచిన్నదాని నడుగుండి.

సుభ—ఓయి దేవుఁడా? నామట్టుకు నాకత్యాశ్చర్యకరముగా నున్నది. అమ్మా! కళావతీ! దీనికి కారణ మేమి?

కళా—ఈయన నడుగు.

వీర—నాకు కోపావేశముతో దేహము పరవశమగుచున్నది. ఓరీ! విక్రమా! నీవీలోపల నీవఱకు వేసిన వేషములుగాక క్రొత్త వేషము వేసి మాఱిపోలేదుగదా? నిజము చెప్పు.

సుభ—అబ్బాయి! ఇప్పుడు మఱేమియు మాయ లేదుగదా? నీవు రావణాసురునివలె నిమిషములో మఱియొక మాయ రూపమును ధరించినావేమో చెప్పు.

విక్ర—చెప్పుమని నన్ను నిర్బంధపెట్టకుండి. ఈవిషయమయి యీచిన్నదే నాకంటె చక్కఁగా చెప్పఁగలదు.

కళా—వెనుక నొకసారి యిఁక విజయపాలుని నెప్పుడును దలఁచుకో వలదని నీవు నాకాజ్ఞ యిచ్చినావు. ఆవిజయపాలుఁ డిప్పు డిక్కడ నీయెదుటనే యున్నాఁడు. అప్పటి నీ యాజ్ఞకు నేనిప్పుడు లోఁబడుచున్నాను. ఈనిమిషము మొదలుకొని నీవు చెప్పినట్లు నే నీతనిపేరు తలపెట్ట మానుచున్నాను. (అని లేచిపోవుచున్నది.)

సుభ—ఓయి భగవంతుఁడా! ఇది పెద్ద యింద్రజాలము వలె నున్నది! ఇప్పుడు సమస్తము తాఱుమాఱయిపోయినదే? ఓయీ!

విక్రమసేనా! నీవు విరసోక్తులాడి నా మేనకోడలి మనస్సు నొప్పించ లేదుగదా?

వీర—సత్య మిప్పుడు బయటఁ బడినది. ఆ-హా-హా-హా! విక్రమా! కోపావేశముచేత పరవశుఁడ వయి నీ వా చిన్నదాని మనసు నొచ్చునట్లుగా నేవో గర్వోక్తులు పలికినావు.

విక్ర—లేదు. తమ పాదములంటోడు—

సుభ—చీచీ! విక్రమసేనా! నీ వేమో యన్నావు.

విక్ర—అమ్మా! నీతోడు—

వీర—ఓరి దొంగా! నీమాట నేను నమ్మను. మాటాడకు. తన చిన్నతనములో నీతండ్రియు నిట్లే చేసెడివాఁడు లే. ఈ వేగిర పాటును క్షాత్రమును మన క్షత్రియకులములోను ముఖ్యముగా పౌరుషభూషిత మైన మనవంశములోను మొదటినుండియు పరంపరగా వచ్చుచున్నవే. ఆహాహా! పాపము! ఎందుకు నీవాచిన్నదానిని నిష్కారణముగా బెదరఁ గొట్టినావురా?

విక్ర—ఈశ్వరసాక్షికముగా—

వీర—నీమాట నేను వినను. నీ ప్రసంగము కట్టిపెట్టు. సుభద్రమ్మ మిమ్మిద్దఱిని సమాధానపఱుచునులే.—ఓ సుభద్రమ్మా! నీ వా చిన్నదానిని సమాధానపఱిచి వీనిమీఁది కోపము పోఁగొట్ట వలెను. వీని స్వభావమే యిట్టిదని నీవు మీకళావతితో చెప్పు. ఈపౌరుషము మాకుటుంబములో నందఱికిని సహజగుణమే యని కూడ చెప్పు.—ఆహాహా! విక్రమా! మనము పోదమురా.— సుభద్రమ్మా! వీడు చాత్రిగా దూరాలోచన లేని దౌర్భాగ్యుఁడు.

(అని విక్రమసేనుని లాగుకొని పోవుచున్నాఁడు)

సుభ—ఓవీరసేనా! మీరు నాతో నింతగాఁ జెప్పవలసిన పని లేదు.—విక్రమసేనా! విచారపడఁబోకు.

(అందఱును నిష్క్రమించుచున్నారు)

---

3. రంగము—ఉత్తరప్రవీథి

[పురుషోత్తమదేవుఁడు ప్రవేశించుచున్నాఁడు]

పురు—విక్రమసేనుఁ డెక్కడ నడఁగిపోయినాడో తెలియకున్నది. ఈయుద్యోగస్థు లెప్పుడును స్త్రీలవ్యవహారములలో నితరుల కడ్డము వచ్చుచునే యుందురు. నేను పూర్వ మీఁగాగుననే వసుమతిని వివాహము చేసికొనుటకు మాటలు జరపుచుండఁగా, ఇంతలో నడుమ నెక్కడనుండియో యొకయుద్యోగస్థుఁ డాకస్మికముగా వచ్చి యాచిన్నదానిని నాకంటఁ బడనీక యెగనెత్తుకొనిపోయి తాను వివాహము చేసికొన్నాఁడు. యౌవనవతు లైనకన్యలను తమవలలో వేసికొనుట కీయుద్యోగస్థులవద్ద నేమిమంత్రము లున్నవో! వారి యెఱ్ఱతలగుడ్డలుచూచి జవ్వనులువలచి పైఁబడి వెంటపరుగెత్తుదురు కాఁబోలును! ఆవచ్చుచున్నవాఁడు విక్రమసేనుఁడు కాఁడా? అతఁడే. సందేహము లేదు. అతఁడొకవేళ తనకృషిలో సాఫల్యము నొందినాఁడేమో! పొందినపక్షమున నామనస్సున కూఱట కలుగదు. అతఁ డిప్పుడు మాటాడుచున్న దెవరితోనయి యుండును?

(అని ప్రక్కకు నడుచుచున్నాఁడు)

[విక్రమసేనుఁడు ప్రవేశించుచున్నాఁడు]

విక్ర—(తనలో) నేను పన్నినతంత్రమంతయు నిరర్థకమయినది. ఇటువంటి మహోపాయములు పన్నిన పాపఫల మనుభవింప

వలసినదే. ఆమెపౌరుష మిట్టిగతి తెచ్చునని నేను స్వప్నావస్థలోను తలఁపలేదు. ఆమోది వట్టిబూతిగుండె. నేనుపుట్టి బుద్ధియెఱిఁగిన తరువాత నిటువంటి దురవస్థను నేనెప్పుడు ననుభవించి యెఱుఁగను. నాగొంతుకనుగాని నాకడ్డువచ్చిన మఱి యెవ్వరిగొంతుకనైననుగాని నేనిప్పుడు నిర్విచారముగా కోయఁగలను.

పురు—ఓహో! ఇప్పుడు నాయదృష్టము ఫలించినది. నా భాగ్యముచేత నేను మంచిసమయమునకు వచ్చినాను. నాపని కనుకూలముగా నితఁ డిప్పటికంటె మంచిస్వభావముతో మఱియెప్పుడు నుండఁడు. కాఁబట్టి యిప్పుడే యితనితో ప్రసంగమారంభించి కలహము పెట్టుకోవలెను.—(అని విక్రమసేనునియొద్దకునడిచి) విక్రమసేనా! ఆవిషయములో నీయభిప్రాయములో నే నేకీభవింపఁజాలను.

విక్రి—వాదవిషయములో నీవు మహాపండితుఁడవయినట్టున్నావే. నే నేయభిప్రాయమును తెలుపనిదే నాయభిప్రాయముతో నేకీభవింపఁజాల కున్నావు!

పురు—నీవు చెప్పినది సయుక్తికముగా లేదు. ఒకమనుష్యుఁ డసత్యము లయినమాటలుపలుకఁగలిగినట్లే పయికి తెలుపకపోయినను లోపల నసత్యము లయినయభిప్రాయములను గలిగి యుండవచ్చును.

విక్రి—అది సత్యమేకాని యొకమనుష్యుఁడు తనయభిప్రాయములను పయికి తెలుపకున్నంతవఱకు పరులతో కలహకారణము కలుగదని నేను భావించెదను.

పురు—అట్లయినపక్షమున, ఈవిషయములోనే మనయిద్దఱికి నభిప్రాయభేదము కనఁబడుచున్నది. వివాదమున కిదియే తగినంత కారణము కావచ్చును.

విక్రి—నీవు పెద్దమనుష్యుఁడవని నేనీవఱ కెఱుఁగనివాఁ

నయి యుండిన పక్షమున నీవిషయమున నేనిప్పుడు దురభిప్రాయ పడియుందును. నాతో వివాదము పెట్టుకొనుటయే నీయభిప్రాయము కాకపోయినపక్షమున, ఇప్పటి నీమాటలయభిప్రాయ మేమో నాకు తెలియకున్నది.

పురు—నీవు సూక్ష్మబుద్ధివి. నాయభిప్రాయమును సరిగా కనిపెట్టినావు. (వంగి నమస్కరించి) నా నోటినుండి రావలసినమాట ముందుగాఁ నీనోటినుండినే వచ్చినది. నే నిప్పుడు నిన్ను యుద్ధభిక్ష వేఁడుటకయి వచ్చినాను.

విక్రి—అట్లయినపక్షమున నీ మనోరథమును నేను విఫలము చేయరాదు. మంచిది. నీవు కోరినట్లే చేసెదను. అయినను నీవు నాతో పోరాఁడఁగోరుటకుఁ గల కారణమేమో యనుగ్రహించిన పక్షమున సంతోషించెదను.

పురు—ఆవిషయమయి నీమనస్సు నాయాసపెట్టఁబోకు. ఇప్పుడున్నట్టుగా మన కలహము మహాదివ్యమైన కలహము. దీనికి కారణమును దెలిపి మన మిప్పుడు దీని సారస్యమును చెడఁగొట్ట కూడదు. నీకు మఱపు మిక్కిలి యెక్కువ. కాకపోయిన పక్షమున వారము దినములలోపల నీవు నాకుచేసిన యపకారమును నీవింతలో మఱచియుండవు. ఆవిషయమయి మనకు వాదులాట యక్కఱలేదు. యుద్ధమునకు నీకు స్థల మెక్కడనో యనుకూల మెప్పుడో మాత్రము చెప్పు.

విక్రి—నీవంత యభిలాష పడుచున్నావుగనుక, నీయుబలాట మెంతశీఘ్రముగా తీఱిన నంతమంచిది. అది యీసాయంకాలమే జరగవచ్చును. ఇక్కడనే యీచేరువ పొలములోనే కావచ్చును. ఇక్కడ మనపనికి విఘ్నము చేయువా రెవ్వరు నుండరు.

పురు—ఎవ్వరో తుచ్ఛులుగాన యిటువంటి విషయములలో పెద్దమనుష్యు లెవ్వరును విఘ్నములు చేయరు. కారణ మేమో తెలియదుగాని మీ దేశములో నిటువంటి విషయము కొంచెము పయికి పొక్కఁగానే జనులు పెద్దయల్లరిచేసి పెద్దమనుష్యులను సుఖముగా నెమ్మదితో పోట్లాడనియ్యరు. నా కీసాయంకాల మారు గంటల కీరాజుగారి జనోద్యానవనములోఁ గొంచెము పనియున్నది గనుక, నీ కాక్షేపణ లేనిపక్షమున మన మక్కడ కూడుకొనుట నా కనుకూలముగా నుండును. ఏకక్రియాద్వ్యర్థకరీ యన్నట్లు నేను రెండుపనులు నొక్కసారియే చక్కఁ బెట్ట వచ్చును.

విక్రి—ఇది నాకును సమ్మతమే. ఆఱుగంట లయినతరువాత మన మక్కడ కలిసికొని సర్వమును సావకాశముగా నేర్పాటు చేసికొందము.

పురు—నాకు మిక్కిలి సంతోషముగా నున్నది. అప్పుడు దూరమునుండి తుపాకులతో పోరాడుటకు మంచిసమయము కాక పోయినను చేరువను నిలిచి కత్తులతో యుద్ధముచేయుటకు తగినంత వెలుతురుండును. ఇంతకును వచ్చినపని యనుకూలముగా ముగిసినది. ఇఁక నామన స్సూఱటపొందును.

(అని నిష్క్రమించు చున్నాఁడు.)

విక్రి—మంచిసమయమునకు వచ్చినావు. ఓదర్పసారా! నీ నిమిత్తము నేనే రావలె ననుకొను చున్నాను. నాపాలిటి యదృష్టదేవతయు సర్వభూతములును సమస్తమును నా కిప్పు డెదురుతిరిగినవి. నామనస్సునకు విసుగుపుట్టి నేను నిరుత్సాహుఁడ నయి యున్నాను. నాభుజవీర్యము చూపి వీరశయనము పొందుటకు

నాకిప్పు డవకాశము లభింపకుండిన పక్షమున, నేనీదుఃఖకథను నీతో చెప్పలేక పోయియే యుందును.

దర్ప—నీభావ మేమో నాకు బోధపడకున్నది. కళావతి తన మనస్సు మార్చుకొన్నదా యేమి? పెద్దలయొక్క యాజ్ఞ కూడ నిప్పు డాచిన్నదానియొక్క యిష్టముననే యనుకూల పడినదని విన్నానే!

విక్ర—ఆమెయిష్టము నా కనుకూలముగా నున్నప్పుడు పెద్దల యాజ్ఞ ప్రతికూలముగా నుండినది. ఇప్పుడు పెద్దల యాజ్ఞ నా కనుకూలము కాఁగానే యామె యిష్టము ప్రతికూలముగా. తిరిగి నన్ను తిరస్కారభావముతోఁ జూచుచున్నది.

దర్ప—నీవిఁకఁ జేయఁదలఁచుకొన్న దేమి?

విక్ర—వేయిమాట లెందుకు? నా కడమాట విను. ఇప్పు డొక్క పెద్దమనుష్యుఁడు వచ్చి తన్ను నాగొంతుక కోయనిమ్మని కోరినాఁడు. నే నాతని కోరిక చెల్లింపఁదలఁచుకొన్నాను. అంతయు నింతే.

దర్ప—ఈవక్రభాషలు మాని తిన్నఁగా చెప్పు.

విక్ర—ఇప్పుడు నేను చెప్పినది వక్రభాష కాదు! సత్యమే. నే నెప్పుడు నేదియు నుద్దేశింపక పోయినను నేనేమో తనకేదో యపకారము తలపెట్టినానని చెప్పి పురుషోత్తమదేవుఁడు వచ్చి నన్నీ సాయంకాల మాఱుగంటలకు తనతో యుద్ధమునకు రమ్మని పిలిచినాఁడు. ఈవిషయమునయే నేను నీవద్దకు రావలె ననుకొన్నాను. నీవు నాకు తోడు రావలెను.

దర్ప—ఇందులో నేదో భ్రమయున్నది. ఈసంగతిని పురుషోత్తమదేవుఁడే వివరముగాఁ జెప్పి సమాధానపడుటకు సందేహ

ముండదు. ఇది మఱియొకప్పుడైన బాగుండును. నీవు చెప్పినది యీ సాయంకాల మనేకదా? మఱియొక సమయమయిన ననుకూలముగా నుండును.

విక్రి—అనుకూలము కాకేమి? అప్పుడు తగినంత వెలుతురుండును. పురుషోత్తమ దేవుఁడు చెప్పినట్లుగా దూరమునుండి తుపాకులతో పోరాడుటకు మంచిసమయము కాకపోయినను చేరువను నిలిచి కత్తులతో యుద్ధము చేయుట కనుకూలము గానే యుండును. తుపాకులతో పోరాట మేఁటి! వానితుపాకులు కాలిపోను!

దర్ప—చారుమతితో సంభవించిన వివాదమును బట్టి నా మన స్సిప్పుడు మంచిస్థితిలో లేదు. పీడాకరమైన నా దుస్స్వభావమునుబట్టి నే ననాదరణ చూపి నిష్కారణముగా నా ప్రియురాలి మనస్సు నొప్పించినాను. మా వివాదము తీఱి యామె మనస్సు సమాధానపడువఱకును నేను మరల పూర్వపు దర్పసారుఁడను కాఁజాలను.

విక్రి—దర్పసారా! నీవు నిజముగానే చారుమతి కర్హుఁడవు కావు.

[ఒక చేటిక యుత్తరము తెచ్చి దర్పసారునిచేతిలోఁబెట్టి నిష్క్రమించు చున్నది.]

దర్ప—ఓ విక్రమా! ఇది చారుమతి వ్రాసినది. దీనిని విప్పుటకు నాకు భయ మగుచున్నది. ఇదే నీకును నాకును కడపటి సెలవని యిందు వ్రాసినదేమో! తాను వ్రాసినయుత్తరముల నన్నిటిని మరల తనవి తనకుఁ బంపుమని వ్రాసినదో!—ఆహా! నే నిప్పుడు స్వయంకృతాపరాధఫల మనుభవించు చున్నాను.

విక్రి—అది నాచేతికిమ్ము. (అని యుత్తరము పుచ్చుకొని విప్పి) ఇందులోనొక్కటేవాక్యమున్నది. ఇంక నీ పనియయిపోయినది.

దర్ప—విక్రమా! నన్నూరక బాధింపక యున్న దేమో చెప్పు.

విక్ర—అట్లయినయెడల, చదివెదను విను. (అని చదువుచున్నాఁడు.) "నాయెడలఁ జూపినయనాదరమునిమిత్తమయి నా ప్రియుఁడైనదర్పసారుఁడే నీవలనకే తనమనస్సు పరితాపపెట్టి శిక్షించియుండు నని నేను నిశ్చయముగా నెఱిఁగినదాననయి నందున, నే నావిషయమై యేమియు ముచ్చటింపక యొక్కసారివచ్చి సాధ్యమయినంతశీఘ్రముగా దర్శనమిచ్చి పొమ్మనిమాత్రము నాహృదయేశ్వరుని వేఁడుచున్నాను. ఇట్లు భవత్పాదసేవకురాలు—చారుమతి.' ఆమె యెట్లు మూర్ఖపుపట్టుపట్టి నీమీఁద పగతీర్చుకొనుచున్నదో చూచినావా? (అని యుత్తరమును చేతి కిచ్చి) ఇది విన్నపిమ్మటఁ గూడ నీ వేమియు సంతోషముగా నున్నట్టు కనఁబడకున్నావే!

దర్ప—నేను సంతోషముగానే యున్నాను. కాని—

విక్రి—నీ కానులు గీనులు దూరముగా పెట్టు. ఇతరులవల్ల నుల్లాసకర మయినమాట విన్నప్పుడు సంతోషించి యూరకుండక వెంటనే "కాని" యన్న పనికిమాలినమాట యొకటిపెట్టినీ వెప్పుడును సంతోషభంగమును చేయుచునే యుందువు.

దర్ప—అవునుగాని. విక్రమసేనా! నీవు నాప్రాణస్నేహితుఁడవు గనుక ని న్నొక్కమాట యడిగెదను. న్యాయమైనయుత్తరము చెప్పు. సంధి గోరుచు వ్రాసినయీయుత్తరములో కొంచెము వేగిరపాటును రసహీనతయు నున్నదా లేదా? సమాధానవాక్యము లెప్పుడును మొట్టమొదట పురుషులవద్దనుండి రావలెనుగాని స్త్రీలవద్దనుండి

రాఁగూడదుగదా? పురుషులు ప్రార్థించి దీనాలాపములచేత తమమనస్సులను కరగించుచుండఁగను తరుణులు తాముదాసీనతను నటింపవలెను. వారివలపువలెనే వారిక్షమయు నయాచితముగా తనంత బయలఁబడఁ గూడదు.

విక్ర—నీమాటలు వినుటకు నాకిష్టము లేదు. ఇఁక నీ వెంత చెప్పినను కార్యము లేదు. ఈవిషయమయి నాతో మాటాడకు. నేనీలోపుగా కొన్ని పనులు చేసికోవలసి యున్నవి. నీవు నేఁడుసాయంకాలములోపల మాయింటికి వచ్చి మఱచిపోక నాతో మాటాడి మరిపో. మనోరథసిద్ధికొఱ కెంతో కష్టపడి యెన్నోమాయలు పన్ని విశ్వప్రయత్నములు చేసి తుదకుపరులదోషమువలనఆశాభంగమునొందిన నావంటివాఁడు కొంచెము విచారపడి విసుఁగుకొన్నఁ గొంతయుందముగను చందమునుగా నుండునుగాని యేకష్టము లేక యప్రయత్నముగా కార్యసిద్ధి యైనప్పుడు సుఖముగా ననుభవింపలేక కుడిచికూర్చుండి లేనిపోనికష్టములు కల్పించుకొని నీవంటివాఁడు విసుఁగుకొన్న పరిహాసపాత్రుఁడు కాకమానఁడు. (అని నిష్క్రమించుచున్నాఁడు.)

దర్ప—ఇతఁడన్నమాటలు నామనస్సునకు నాటుకొన్నవి. అయినను నాగుణమును మార్చుకొని పఱికిమాలినసంతుష్టి పొందియూరకుండఁజాలను. ద్వంద్వయుద్ధమునకు సహాయుఁడవు కమ్మని యితఁ డడుగుటచేత నాకిప్పు డొకయాలోచన తోఁచుచున్నది. నే నీయుద్ధములో ప్రవేశించి యిందుమూలమున చారుమతికి నామీఁద నిజమైనప్రేమ యున్నదో లేదో పరీక్ష చేసి చూచెదను. ఈపరిశోధనవలన నామెవలపు నిర్మలమయినదిగా తేలినపక్షమున, నేను ధన్యతముఁడనయి నాసందేహములు విడిచి తృప్తినొంది యుందును,

అట్లుగాక యాశోధనలో నొకవేళ చారుమతియొక్కయనురాగము శుద్ధమయినదిగా తేలనిపక్షమున, ఇంతటితో నేనామెసంబంధమును విడిచి యామెను మతిరియొక బుద్ధిహీనుని పెండ్లిగమ్మని వదలిపెట్టి యూరకుండుట సర్వోత్తమము. (అని నిష్క్రమించుచున్నాఁడు.)

పంచమాంకము

౧. రంగము—చారుమతియొక్కగది.

[చారుమతి ప్రవేశించుచున్నది.]

చారు—ఈయుత్తరము చూడఁగా నాకుభయమగుచున్నది. ఎవ్వరి కేమి యుపాయము సంభవింపవచ్చునో! అతఁ డేమి తలఁచుకొన్నాఁడో! వన్నొంటిగాఁ జూడవలెనని యేలకోరవలెను? ఓ దర్పసారా! నీవు నామన స్సెంత నొప్పించుచున్నావు?

[దర్పసారుఁడు ప్రవేశించుచున్నాఁడు.]

చారు—దీనికర్థమేమి? దర్పసారా! ఇంత జాగరూకత యెందుకు?

దర్ప—ఓ చారుమతీ! చిరకాలము నిన్ను చూడఁబోనుగాన నీవద్ద సెలవు పుచ్చుకొని పోవలెనని వచ్చినాను.

చారు—ఓ యీశ్వరా! ఈమాటల కర్థమేమి!

దర్ప—నీయెదుట నిలువఁబడియున్న నేనుప్రాణత్యాగమునకు తెగించియున్న నిర్భాగ్యుఁడను. ఉలికి పడఁబోకు. నా దుర్బలస్వభావమే నా కీగతి తెచ్చినది. అప్పుడు నిష్కారణముగా నిన్ను తూలనాడి నీకు కోపము తెప్పించి వెడలి పోయినాను. అనివార్యమైన యొక దుర్దశచేత నాకీలోపల నీకలహాము సంప్రాప్తమయినది.

కాబట్టి నేను తత్క్షణమే యీ దేశమును విడిచి లేచి పోవలెను. ఓ చారుమతీ! నాకీ దుర్దశ సంభవించుటకు పూర్వమునందే నిన్నర్థాంగి నని పూర్ణముగ బిలుచుటకుఁ దగిన భాగ్యమును నేను పొందిన యెడల, నాయీ దేశత్యాగమువలన నాకింత దుఃఖము కలిగియుండక పోను.

చారు—నీకు సంభవించిన యీ దుర్దశయొక్క స్వభావమును చింతించి నా మనస్సు చింత నొందుచున్నది. ప్రాణాపాయకరమయిన యీ కారణమువలనఁగాక మఱియొక కారణమువలన నిప్పటి కష్టము సంభవించియుండినయెడల, నాయనురాగ విషయమున నీమనస్సులోనున్న సంశయమును తొలగింప నవకాశము కలదు కదాయని నాహృదయము కొంత విశ్రాంతి పొందియుండును. నా హృదయమును నేను చిరకాలము క్రిందటనే నీకు సమర్పించియున్నాను; ఇప్పుడు నాశరీరమును గూడ నీకర్పించెదను. దేశము విడిచి మన మిద్దఱము ను గలిసి పాఱిపోదము. శత్రువులను తప్పించుకొని పాఱిపోయి క్షేమముతోనున్న తరువాత మాతండ్రిగారి యిష్టమును చెల్లింపవచ్చును. నీ సుఖ దుఃఖములలో సమభాగినినిగా నుండుటకు విధ్యుక్తముగా బద్ధురాలనయి నేను నీకు హృదయశాంతి చేయుదాన నగుదును. అప్పుడు నీవు నీ ధర్మ పత్నియైన చారుమతి యొక్క మృదువులయిన యూరువులమీఁద హాయిగా విశ్రమించి సుఖించుచుండఁగా, పాతివ్రత్యభూషితురాలయిన నీ ప్రియురాలు తనమృదు హస్తములతో నీహృదయమునందలి విచార శల్యములను వెకలించి నొప్పిని కలిగించుచున్న విపత్కటకములను తీసివేయును.

దర్ప—ఓచారుమతీ! నీకృతజ్ఞతాఋణమును తీర్చుకొనుటకు నేను నిఱుపేద నయియున్నాను. ఇప్పుడు కాలమునిలువకపరుగెత్తుచు

వేగముగా మనోనిశ్చయమును చేసికొమ్మని నిన్ను నిర్బంధించుచున్నది. నీకు సంభవింపఁబోయెడునష్టములను గూర్చియు తత్ప్రతిఫలముగా నొక్క ప్రేమమును దక్క మఱి దేనిని దర్పసారుఁడు సమర్పించుకోలేక పోవుటనుగూర్చియు సావకాశము నాలోచించుటకు నీకు కొంత కాలము కావలసి యుండునుగదా?

చారు—నాకొక నిమిషమయిన నవకాశ మక్కఱలేదు. నేనొక్క నీ గుణములకే వలచినదానను గాని యన్యమును దేనిని కామించినదానను గాను. మనము చిరకాలమునుండి కాంక్షించి యున్న యభిమతసిద్ధిని బడయుట కిదే సమయము. ఇఁక నాలస్యము చేయఁగూడదు. ఈ యాలస్యమువలన నొకవేళ—

దర్ప—చీఁకటిపడువఱకు నేను మరల వెలుపలికి రాకుండుట క్షేమకరము. నీసత్స్వభావమునుబట్టి నీకు లెక్కలేని కష్టములువచ్చునని తలఁచి నేను ఖేదపడుచున్నాను.

చారు—ఈ కార్యమువలన నొకవేళ నీకుఁగల సొత్తు పోవును గాఁబోలును! ఆసంగతి నాకు నిశ్చయముగా తెలియదు. అయినను మనకంతమాత్రముచేత సుఖభంగము కలుగదనిమాత్రము నేను దృఢముగాఁ జెప్పఁగలను. నాకున్న యల్పధనమే మనకిద్దఱకును జాలును. పరదేశమునం దెప్పుడును భోగము లనుభవించుటకు లభింపవుగదా?

దర్ప—అది సత్యమేకాని యటువంటి హీనదశయందు నా చిరాకు మఱింత యెక్కువయయి, నీవెంత సహసము కలదానవైనను నీకు దుర్భరమగునేమో! అటువంటి దురవస్థతటస్థమయినప్పుడు నేను నీతో తగవులాడి కోపావేశముచేత మతిపోయి యేమి చేయుదునో!

చారు—నిజముగా నటువంటి దుర్దశయే నీకొకవేళ పట్టుట తటస్థించిన పక్షమున నీకు కోపోపశమనము చేసి మృదుమధురశీతల వచనామృత ధారలతో నీ హృదయములోని శోకాగ్నిని చల్లార్చుట కయి నీ సంరక్షణ భారమును వహింపవలసిన వారొక రప్పుడు మఱింత యావశ్యకముగాఁ గావలసియుందురు. నీ దౌర్బల్యమును కనిపెట్టి తగిన యుపచారము చేయుచు భాగ్యలోపమువలనఁ గలుగు కష్టములను ధైర్యముతో నోర్చునట్లు నేర్పఁగల దేహసంబంధులు లేక యట్టికష్టములు నీకెట్లు సహ్యములగును?

దర్ప—చారుమతీ! ఈ పనికిమాలిన పన్నుగడలచేత నీ మనస్సు పరిశోధించి నామనస్సులోని సందేహముల నన్నిటిని నివారణము చేసికొన్నాను. నా దుస్స్వభావముచేతఁ జేసిన యనర్హమయిన యీయపరాధమును మన్నింపుమని నిన్నెట్లు వేఁడుకొనవలయునో తెలియకున్నది.

చారు—నీ వింతవఱకును జెప్పినట్లు నీకేమియు నాపద తటస్థింపనే లేదా!

దర్ప—ఇదియంతయు కేవల కల్పనమని యొప్పుకొనుటకు సిగ్గుపడుచున్నాను. ఇటువంటి యపరాధమును నేనిఁకముందెప్పుడును మరల నీ విషయమునఁ జేయను. కాఁబట్టి నాయందు దయదలఁచి నామీఁద పగ సాధించి చంపక నన్నింతటితో క్షమింపుము. ఈ యొక్కసారిమాత్రము నా ప్రార్థన మంగీకరించి నన్ను మన్నించితివా, ఈశ్వరానుగ్రహమువలన తేపే నీచెట్టఁబట్టి నీపాలఁబడి, నీ ప్రాపువలన స్వస్థచిత్తుఁడనయి నీ నిరంతరం సేవచేత నాగతపాపము పరిహరించుకొనెదను.

చారు—ఓదర్పసారా! చాలును. ఇంతవఱకును నీవేదో

ఘోరపాతకము చేసితివని తలఁచుకొని దానిపేరడుగుటకు భయపడుచున్న యీపాపము చేయలేదని తెలియఁజెప్పి నామనస్సున కపార సంతోషమును కలిగించినావు. ఆ విషయమయి నేను మిక్కిలి కృతజ్ఞురాలనయి యివె యానంద బాష్పములను విడుచుచున్నాను. అయినను నీ క్రూరములయిన యీ యనుమానములును మాయలును ములుకులవలెనాటి నా కనిర్వాచ్యమైన మనోవ్యథను కలిగించుచున్నవి.

దర్ప—ఈశ్వరసాక్షికముగాఁ జెప్పెదను. ఓచారుమతీ—

చారు—నామాట కడతేఱ వినుము. నాతండ్రికి నీయందు పుత్రాధికమైన ప్రేమముండెను. ప్రేమానిధియైన నాతండ్రియిచ్చిన యీప్రాణమును నీవు కాపాడినావు. అప్పుడాతని సమక్షమందు నా హృదయమును నీకర్పింపఁ గలుగుటకంటె ముందుగానే నాహస్తమును సంతోష పూర్వకముగా నీ కర్పించినాను. అటుతరువాత శీఘ్రకాలములోనే యాతండ్రిని నేను పోఁగొట్టుకొన్నప్పుడు, ఈశ్వరుఁ డన్నిటికిని దర్పసారునినే చూపినాఁడని భావించుకొని తత్క్షణమే నా హృదయమును గూడ సమర్పించి యప్పటినుండియు మరియొకరి విషయమయి యెప్పుడును పడనొల్లని కష్టములకెల్ల నీకయి యోర్చి సంతుష్టురాలనై యున్నాను. అటువంటి నాయవ్యాజానురాగమును చులకనచేసి నీవుచేసినయవజ్ఞలనెల్ల నేకరువుపెట్టి యిప్పుడు నీమనస్సునకు నొప్పి కలిగింపనొల్లను —

దర్ప—అది యంతయు నేనే యొప్పుకొనుచున్నాను. అయినను నామాట విని—

చారు—సంవత్సరకాలము నన్నుశోధించి నాయకృత్రిమానురాగమును కనుఁగొన్నతరువాతఁగూడ నిట్లనుమానపడుచు లేనిపోని

దుశ్శంకలచేత నన్ను మరల క్రూరముగా నవమానపఱుతు వని నే నెప్పుడు ననుకోలేదు. తృప్తిగాని ప్రేమించినవారియందు విశ్వాస ముంచుటగాని నీస్వభావములో లేదని నా కిప్పుడు స్పష్టపడినది. తత్త్వము బోధపడినతరువాత నే నిఁక నిన్ను నమ్మి మోసపోను. నా యవ్యాజానురాగమువలనను విశుద్ధచరితమువలనను నీకు నాయెడల పూర్ణమైనవిశ్వాసమును కలిగింపఁగలుగుదు నన్నదురాశ యున్నంత కాలము, నీకు తృప్తికరముగా ప్రవర్తింపవలెనని నేను సర్వవిధములఁ బ్రయత్నముచేసి చూచినాను. నీకు సంతుష్టి కలుగఁజేయుట యసాధ్య మని యిప్పుడు తేటపడుటచేత, నేనిఁక నీకు వివాహబంధముచేత కట్టుపడి బుద్ధిపూర్వకముగా నెల్లకాలమును నీవలన బాధ లనుభ వించుట కయి గృహదాసిని కాఁజాలను.

దర్ప—ఈతప్పు క్షమింపుము. ఈశ్వరునితోడు! ఇఁకముందు నే నెప్పుడయిన—

చారు—ఇంకొక్కమాట యున్నది. ఇది కడతేఱ వినుము. ఈవఱకు నామనస్సును నీ కర్పించితినిగాన, ఇఁక నే నెప్పుడును దాని నన్యపురుషునిపాలు చేయను. ఈశ్వరుఁడు నిన్ను నిత్యసంతుష్టుని జేయునుగాక! మనవివాహబంధము నిప్పుడు ఛేదించిన నీ యసంతుష్టి నిన్ను శీఘ్రముగా విడుచునుగాక! నీయీదుర్బలతను తలఁచుకొని నీవు చింతిల్లునప్పుడు, నీ నిత్యశంకిత్వమువలన యావజ్జీవమును నీపాద సేవకురాలయి యవ్యాజప్రేమతో సుఖదుఃఖములయందు నీతోడి నీడగా నుండ నిశ్చయించుకొన్న సంపన్నురాలు ని న్నెడఁబాసిన దని మాత్రము విచారపడఁబోకు. (అని నిష్క్రమించుచున్నది.)

దర్ప—నాపాలిటిభాగ్యదేవత నన్ను విడిచి పోయినది. అటువంటి కన్యారత్నము నావంటిమందభాగ్యున కెట్లు దక్కును! ఆమె

మనోనిశ్చయమును దలఁచుకొన్న నాకు భయ మగుచున్నది. నేను క్రూరుఁడను; మృగప్రాయుఁడను; వివేకహీనుఁడను; అయోగ్యుఁడ నయినను నా కిట్టిభాగ్యలక్ష్మి నీశ్వరుఁ డనుగ్రహించినప్పు డనుభవింప లేక కూలఁద్రోచుకొన్నాను. ఇఁక నాకు భాగ్యాశ లేదు. నాపనికి నేను పోవలెను. ఆయుద్ధములో సహాయపురుషు డనుగాక విక్రమ సేనునికి మాఱుగా నేనే ప్రధానపురుషుఁడ నయిన నెంతయు మేలుగ నుండును.—ఓ కాముఁడా! నన్నిట్లేల బాధించెదవు? నీదుస్సహ వేదనకు నేను తాళఁజాలను. నేను ప్రాణత్యాగము చేసికొనెదను.

(అని నిష్క్రమించు చున్నాఁడు.)

[ఒక పరిచారికయు, కళావతియు ప్రవేశించు చున్నారు.]

పరి—నాయజమానురా లింతకుమును పిక్కడనే యున్నది. ఒకవేళ నామె యిప్పుడే యాగదిలోనికిఁబోయి యుండును.

(అని వెడలి పోవుచున్నది.)

కళా—కటకటా! అతఁ డట్లు చేసినను నాహృదయ మాతని నుండి మరలకున్నది! నావదినెవచ్చి యిప్పు డొక్కయుపన్యాసము చేసినపక్షమున, మరల నా కాతనిని ప్రార్థింపవలె నన్నబుద్ధికూడ పుట్టునేమో!

[చారుమతి ప్రవేశించు చున్నది.]

కళా—చారుమతీ! నాకిప్పుడు మనశ్శాంతి కావలసి నీవద్దకు వచ్చినాను. (మొగమువంకఁ జూచి) ఓహో! ఇది యేమి? ఏడ్చు చున్నా వేమి? ఆదర్పసారుఁడు నిన్ను దుఃఖపెట్టుచుండ లేదుగదా?

చారు—నీ వనుకొన్నది కారణము కాదు. నాకు దుఃఖము కలుగుటకు కారణము వేరేయున్నది. నీవది తెలిసికోలేవు- (తనలో) కళావతివద్ద దర్పసారునిమీఁద నింద మోపను.

కళా—నీకెంత మనోవ్యధ కలిగి యున్నను నీది నామనో వ్యధకు సమానము కాదు. తుదకు విజయపాలుఁ డెవరయినాఁడో విన్నావా?

చారు—అదంతయు దర్పసారుఁడు మొదటనే నాతోఁ జెప్పినాఁడు. విజయపాలుఁడని నీవనుకొనుచుండినవాఁ డెవఁడో నేనెఱుఁగకుండినపక్షమున, అతనిమీఁద నీకుఁ గలచాపల్యమును నేనుప్రోత్సాహపఱిచి యుండను.

కళా—అట్లయినయెడల నేనందఱివలననుమోసపోయినాను. పోనిమ్ము. ఇఁక నే నాతనిని వివాహ మాడను.

చారు—అవునుగాని, కళావతీ!

కళా—నామాట విను. ఇట్లు చేయుటచేత నాకేగాదు మఱి యెవ్వరికైనను కోపము రాకుండునా? మూకెంతో కష్టమువచ్చునవియు, ధైర్యసాహసములు చూపవచ్చుననియు, నేనెదురుచూచుచున్నప్పుడు తుదకు కార్యమంతయు చప్పబడి నిస్సారమయిపోయినది. మాఱువేషము వేసికొనుట, త్రాటినిచ్చెనతో గోడలుదాటుట, చీఁకటిలో నాలుగుగుఱ్ఱములబండియెక్కి పాఱిపోవుట, గాంధర్వవివాహమాడుట, అన్నియు చెడిపోయినవి. ఇంత యాశాభంగము కలిగిన తరువాత నేను నలుగురిలో తలయెత్తుకొని యెట్లు బ్రతుకఁ గలను?

చారు—నాకిది వింతగా కనఁబడదు.

కళా—తుదకు నాకెంత యాశాభంగము కలిగినదో చూచినావా? పాఱిపోవుట కెంతో సన్నాహము చేసికొన్నతరువాత, కట్ట కడపట నేమియు లేకుండ నా మేనత్త యనుమతితో మాయింట

పుస్తెముడిపెట్టించుకోవలసిన గతిపట్టినది. ఇటువంటి దుర్యోగము నకు సహింపఁగలిగిన నేను ముందేమి చూడనున్నానో!

చారు—పాపము! నీకెంతటి దురవస్థ సంభవించినది!

కళా—అతనితో నర్ధనిమిష కాలము మాటాడఁ గలుగుట కయి పన్నిన యా మా యుపాయమును స్మరణకుఁ దెచ్చుకొనఁగాఁ నాకిప్పుడు దుఃఖము వచ్చుచున్నది. మాఘమాసములో చలిలో నిశీథవేళ నొంటిగా బయలుదేఱి పుష్పవనములో చిత్రప్రతిమవలె నిశ్చేష్టుఁడయి నిలుచున్న యాతనిని కన్నులపండువుగా చూచు చుండెడిదానను. ఆసమయమునందు చలిచేత నతఁడును భయము చేత నేనును వడఁకుచు, పరస్పర శరీరస్పర్శనము చేసి యానందా మృతసాగరమునందు మునిఁగి తేలుచుండెడివారము. అంతటిప్రేమ యిప్పుడింతటికి వచ్చినది.

చారు—నే నిప్పు డుత్సాహస్థితిలో నుండియున్న పక్షమున, నీ యవివేకమునకు పకపకనవ్వి చీవాట్లు పెట్టియుందును. అయినను నీయందట్టి యనురాగాతిశయము గలవానిని పనికిమాలిన నీచపల తనుబట్టి విడనాడి నిష్కారణముగా పరితాపము పాలుచేయవలదని మాత్రము నే నిప్పుడు నిన్ను బతిమాలుకొనుచున్నాను.

కళా—ఓహోహో! ఈసమయములో నా మేనత్తకూడ వచ్చినదేమి?

[సుభద్రమ్మయు, రాముఁడును, మాధవుఁడును ప్రవేశించుచున్నారు]

సుభ—అయ్యో! అయ్యో! కొంప మునిఁగినది. పొలములో హత్యలు జరుగుచున్నవి. నరహత్యలు. ఉపద్రవము తప్పించుట కయి యెక్కడ వెదకినను వీరసేనుఁడుగారు కనఁబడరు.

చారు—అమ్మా! ఏమియుపద్రవము వచ్చినది?

సుభ—ఇతని వడుగు నాతోఁ జెప్పినవాఁ డితఁడే.

కళా—(రామునితో) ఏమితటస్థించినదో చెప్పు.

రాము—తాను ముఖ్యంగా సంబంధించివున్నచిన్నది యింత ఆతురపాటుతో అడుగుతూవున్నప్పుడు జరిగినసంగతి శీఘ్రముగా చెప్పక ఆలస్యం చెయ్యడం నావంటి వివేకం గలవాడికి యెంత మాత్రమూ ధర్మంకాదు.

కళా—శీఘ్రముగాఁ జెప్పు. వేగిరము.

రాము—అమ్మా! తమరు సెలవిచ్చినట్లు యీటువంటిసంగతులు శీఘ్రంగా చెప్పివెయ్యవలెను. ఆలా చెప్పకుండా యేమాత్రం ఆలస్యంచేసినా యీలోపుగా రెండుమూడు ప్రాణాలకు భంగం రావచ్చును.

కళా—నే నీ విలంబము సహింపలేను. అత్తా! ఏమిజరిగినదో నీవైనను జెప్పు.

సుభ—జరుగుట కేమున్నది? నఱకులాట జరుగుచున్నది. హత్యలు జరుగుచున్నవి. చావులు తటస్థించుచున్నవి. ఆవివరములితఁడు చెప్పఁగలఁడు.

కళా—ఓరామా! నిన్ను ప్రార్థించుచున్నాను. సంగతి యేమో రెండుమూడు మాటలతో చెప్పు.

రాము—నరుకులాట విషయమయి యెవ్వరి నెవరునరికినారో నేను చెప్పలేను. నరహత్య నేరం విషయమై ధర్మాధికారులే నిజం కనుక్కొని యెవరియందు దోషంవుంటే వారిని శిక్షిస్తారు.

కళా—ఎవరు? అట్లు పోట్లాడుచున్నవా రెవరు?

రాము—వారిలో వొకరు బహుచిన్నవాడు; మహా దొడ్డవాడు. ఆయనకు యేవిధమయిన అపాయమూ జరగడం నాకు

యిష్టములేదు. ఆయనకు నామీద యెంతో ప్రేమ. నన్నెప్పుడూ పల్లెత్తుమాట అనలేదు.

కళా—ఆయన యెవరు? ఎవరు? ఎవరు?

రాము—నా యజమానుడు. అమ్మా! నాయజమానుడు. తెలిసినదా? ఆయన నాయజమానుడు.

కళా—ఓ యీశ్వరుఁడా! విక్రమసేనుఁడా యేమి?

సుభ—ఓహోహో! ఇప్పుడు నీవు భయపడుచున్నట్టున్నావే?

చారు—అతనితో నున్న రెండవవా రెవరు?

రాము—తక్కిన సంగతి నాకంటె యితను బాగా చెప్ప గలడు.

చారు—మాధవా! నీవు చెప్పు.

మాధ—అమ్మా! ఆవంక చూడు. జరిగే అనర్థమంతా అక్కడ జరుగుతూవున్నది. వూరికే వినోదంకొరకయితే కత్తులతోనూ తుపాకులతోనూ వెళ్ళరు. వాటినిచూస్తే నాకు వారు కోపంతో వెళ్ళినట్టు తోస్తూవున్నది.

చారు—విక్రమసేనుఁడుగాక యక్కడ మరెవ రున్నారు?

మాధ—మందభాగ్యుడైన నా యజమానుడొకడు. అతని యందువుండే దయచేత, అతనిపేరు నేను ముందుగా చెప్పలేక పోయినాను. అమ్మా! నీవు నన్నెరుగుదువుగదా! నేను మాధవుణ్ని. ఇంకా ప్రాణాలతో వున్నపక్షమున నా యజమానుడు దామోదరవర్మ. దర్పసారుడుకూడా అక్కడనే వున్నాడు.

చారు—అమ్మా! మనము వెంటనే యక్కడకుఁ బోయి పోరాటము మాన్పవలెను.

సుభ—అటువంటి క్రూరకర్మము జరుగుస్థలమునకుఁ బోవుట స్త్రీలకు తగదు.

మాధ—అమ్మా! మీరు శీఘ్రంగా పోయి కలహం నివారించవలెను. మీరు వెంటనే వెళితే కొన్నిప్రాణాలైనా దక్కుతవి. వారందరూ తెంపరులై వున్నారు. అందరినీమించిన దయాదాక్షిణ్యాలు లేని పురుషోత్తమ దేవుఁడుకూడా వారిలో వున్నాఁడు.

సుభ—పురుషోత్తమ దేవుఁడా ? హా ! దైవమా ! ఈపడుచువాం డ్రియననుగూడ తమ కయ్యములోని కీడ్చినారుగదా ! అమ్మాయీ! అట్లు నిలుచున్నావేమి? నీహృదయములో నేమూలను దయ లేన ట్లున్నది.

కళా—అత్తా! ఇప్పుడు మనము చేయవలసిన దేమి?

సుభ—ఎవ్వరికి నపాయము జరగకుండ మాన్పుటకయి మన మక్కడకు లేళ్ళవలె పరుగెత్తుకొని పోవలెను. అన్నా! మాకు నీవా స్థలమును జూపఁగలవా?

రాము—నేను మిమ్మల్ని అక్కడకు తీసుకుపోతాను.—ఓరీ! మాధవా! వీరసేనుఁడుగారిని తీసుకుని రావడానికి నీవు వెళ్ళు.

(అని నిష్క్రమించు చున్నాఁడు.)

సుభ—కన్నెలారా! నా వెంటరండి. ఇతఁడు మనల నక్కడకుఁ దీసికొని పోవును.—రామా! నీవు ముందునడిచి మాకు దారి చూపు.

రాము—స్త్రీలను మిమ్మల్ని వెనుకదిగవిడిచి లక్షవరహాలిచ్చినా నేను ముందర పోను.

సుభ—నీవాస్థల మెఱుఁగుదువా? నిజము చెప్పు.

రాము—ప్రయత్నంచేస్తే నేను కనుక్కోగలననుకుంటాను. దారితప్పిపోకుండా వుండడానికి నాకొక్క శుభసూచకం కనపడుతూ వున్నది. తుపాకుల చప్పుడు వినపడడంతోటే, ఆ చప్పుడునుపట్టి మన మా స్థలానికి తప్పకుండాపోవచ్చును. భయపడకండి. మీకు వచ్చిన భయమేమీ లేదు. మీప్రాణాలకు నాప్రాణా లడ్డంవేస్తాను.

(అందఱు నిష్క్రమించు చున్నారు.)

---

౨ రంగము—దక్షిణపువీధి.

[తనకత్తి బట్టలోఁబెట్టుకొని విక్రమసేనుఁడు ప్రవేశించుచున్నాఁడు]

విక్ర—ఈగ్రామములో వీధిలో నెవ్వరిచేతిలోనైన కత్తి కనఁబడినపక్షమున నెల్లవారును వెఱ్ఱికుక్కను జూచినట్లు భయపడుదురు. దర్పసారుఁ డింకను రాలేదు. అతఁ డెప్పుడును వేళకురాఁడు. అతనిని విడిచి తుదకు నే నొక్కఁడనే పోవలసి వచ్చినది. ఓయి దేవుఁడా! ఇప్పుడు వీరసేనుఁడుగారీవంక నే వచ్చుచున్నారే! ఈయనను నే నెట్లు తప్పించుకొను ?

(అని తలవంచుకొని తొలఁగిపోవుటకు ప్రక్కకు తిరుగుచున్నాఁడు.)

[వీరసేనుఁడు ప్రవేశించు చున్నాఁడు.]

వీర—ఆవచ్చెడివా రెవరో దూరమునుండి యానవాలుపట్టుట కష్టముగా నున్నది. అతఁడు మావిక్రమునివలె నేయున్నాఁడు. అవును వాఁడు మావిక్రముఁడే. సందేహము లేదు. ఓరీ ! విక్రమా ! విక్రమా ! (అని సమీపమునకుఁ బోవుచున్నాఁడు.)

విక్ర—అయ్యా! మీరు నన్ను గుఱుతుపట్టినారుగాని మిమ్ము

నేను గుఱుతుపట్టలేదు. మిమ్ము నేనెప్పుడును జూచియున్నట్లుజ్ఞప్తికి రాలేదు. నా పేరు వర్ధమానుఁడు. నాతో మీ కేమైన పనియున్నదా?

వీర—అట్లయిన నన్ను క్షమింపవలెను. నేను భ్రమపడినాను. మిమ్ముజూచి—ఏమి? వానివలెనే యున్నాఁడే!—నిమిషము నిలువుఁడు. (మొగమువంక తేఱిపాఱఁజూచి) ఓహోహో! వర్ధమానుఁడుగారా తమరు? ఓరి దున్నపోతా! నీ విప్పు డేమి మాయ చేయఁ దలఁచుకొన్నావు?

విక్ర—ఏమియు లేదు. నేనిప్పుడూరక నవ్వులాటకన్నాను. నేనన్నది వట్టి నవ్వులాటమాట. తమకొఱకే నేనిక్కడకు వెదకుకొనుచు వచ్చినాను.

వీర—అలాగా? నీవదృష్టవంతుఁడవుగనుక నేను వెంటనే కనఁబడినాను. ఆ వేషమంతయు నేమి—

విక్ర—మఱేమియు లేదు. ఇది చలిరాత్రి. అంతయు తరువాత తమతో మనవిచేసెదను. నాకు కొంచెము పనియున్నది. నన్నిప్పుడు విడిచిపెట్టుఁడు.

వీర—నిమిషము నిలువు. పోకు. నీవు నాకొఱకే కాదా యిక్కడకు వెదకుకొనుచు వచ్చినావు? ఇంత తొందరగా నీవిప్పుడెక్కడకు ప్రయాణము?

విక్ర—ప్రయాణమా?

వీర—అవును. నీవిప్పు డెక్కడకు పోవుచున్నావు?

విక్ర—నేనెక్కడకు పోవుచున్నానా?

వీర—ఓరి గాడిదా!

విక్ర—ఎక్కడికా? నేను—నేను—ఇప్పుడు నేను కళావతి యొద్దకు వెళ్ళుచున్నాను. ఎందుకా? సాధ్యమైనయెడల, నేనా—

చిన్నదానిని ప్రార్థించి సమాధానపఱుచుటకు మీకొఱకేల యెదురు చూచుచున్నానా? ఆపని కేమియు—

వీర—తెలిసినది. నన్ను నీతోఁగూడ వెంటబెట్టుకొని పోవుటకు నేకూడ వచ్చెదను పద.

విక్ర—కాదు కాదు. ఆపనినిమిత్తము కాదు. మఱియెందుకా? ఊరకే మిమ్ముఁ జూచి సెలవుపుచ్చుకొని పోవుటకు. అంతే. ఇది చలి రాత్రి. మీరు బైల తిరగఁగూడదు.

వీర—ఆపనినిమిత్తమే కాదా? ఇది చలిరాత్రి యేమి? మంచిది కళావతితో నీ వేమని చెప్పెదవు?

విక్ర—ఏమున్నది? ఆచిన్నదానిని నన్ను క్షమింపుమని వేఁడుకొనెదను; మంచిమాటలు చెప్పెదను; ఒట్లు పెట్టుకొనెదను; పాదముల మీఁద బడెదను. అయ్యో! మీ కాలస్య మగుచున్నది. చలిలో నడిచినపక్షమున మీకు జబ్బు చేయును. శీఘ్రముగా నింటికి పొండి.

వీర—నాకా భయము లేదు. నేను పోను. మీవంటి కుఱ్ఱవాండ్రకు గుండెలలో చలి సోఁకినప్పుడు—(అని యాతని గుండెలు తడవుచు)—ఇది యేమి? ఇక్కడ నేదో లోపల చేతికి గట్టిగా తగులుచున్నది!

విక్ర—ఏమియు లేదు. మఱేమియు లేదు.

వీర—ఏమియు లేనేలేదా? నా చేతికి లోహమువలె గట్టిగా సోఁకినదే!

విక్ర—కడియములు. కడియములు. కళావతినిమిత్తము కడియములజత!

వీర—నీ వెటువంటి కడియములు చేయించినావో చూడనీ. (అని పయిబట్ట లాగఁగానే కత్తి క్రింద పడుచున్నది.) ఇది యెంత

మంచికడియములు! కళావతినిమిత్తమా యీకడియములజత! ఈ కత్తితో నీవాచిన్నదాని గొంతు కోయదలఁచుకోలేదుకదా?

విక్ర—అహాహాహాహా! ఇది చివరవఱకు మీతోఁజెప్పకుండ నుండి కడపట దీనితో మీకు వినోదము కలిగింపవలె ననుకొన్నాను.

వీర—నాతోఁ జెప్పకపోవలె ననుకొన్నావుగా? ఇది నిశ్చయముగా నాకు వినోదము కలిగించెడు కడియములజతయే! సందేహము లేదు,

విక్ర—ఇఁక మీతో నిజమే చెప్పెదను వినుఁడు. కళావతి స్వభావము మీరెఱుఁగుదురుకదా? ఆమె నన్ను క్షమింప నన్నపక్షమున, ఈకత్తి పయికిఁదీసి "యిప్పుడు దీనితో గొంతు కోసికొని నీ పాదములముందలపడి ప్రాణములు విడిచెద"నని బెదరించి యామె మనసు కరఁగించి యామెను లోఁబఱుచుకోవలెనని యీఖడ్గము కొనిపోవు చున్నాను.

వీర—నీవు కత్తితోఁ గాదు, ఏకుతో గొంతు కోసికొనెదవు. ఒకవేళ నీమాయవేషమువల్ల కళావతిమనసు కరఁగవచ్చును. పో.

విక్ర—నావిజయవార్తను కొంతసేపటికి మీరే విని సంతోషించెదరు—ఓకళావతీ! నన్ను క్షమించు. క్షమించనిపక్షమున నీ యెదుటనే నేనీకత్తితో పొడుచుకొని ప్రాణత్యాగము చేసికొనెదను అని చెప్పెదను.

వీర—"ఓప్రబుద్ధుఁడా! ప్రాణత్యాగము చేసికోకు కత్తివిడిచి నాచేయి గ్రహించు"—అని యాచిన్నది నిన్నాదరించునులే నీ కడియములజత పట్టుకొని నీవు శీఘ్రముగా పో.

విక్ర—చిత్తము. (అని నిష్క్రమించు చున్నాఁడు.)

[అంతట మాధవుఁడు పరుగెత్తుకొని వచ్చుచున్నాఁడు.]

మాధ—అతణ్ని నిలపండి. ఆపండి. చావు నరుకులాట.—ఓవీరసేనా! అతణ్ని నిలపండి. పోనియ్యకండి నరుకులాట! చావులు!

వీర—నఱుకులాటా? చావులా? ఎక్కడ?

మాధ—అప్పుడే అతఁడు కంటికి కనపడకుండా మాయమయి పోయినాఁడు. నేను నాశాయశక్తులా వగర్చు వచ్చేటట్టుపరుగెత్తుకొని వచ్చినాను. అయ్యా! మీరతణ్ని యెందుకు ఆపినారుకారు? మీరు పట్టుకొని నిలిపి వుంచవలసింది.

వీర—నీకు మతిపోయినదా యేమి? ఆపవలసిన దెవరిని? నిలుపవలసినది మావిక్రమునినా?

మాధ—విక్రమసేనుణ్నే. నరహత్య జరుగుతూవున్నది.

వీర—నరహత్యా!

మాధ—అయ్యో! యెన్నోనరహత్యలు జరుగుతూవున్నవి. ఆపొలాలలో యెన్నోవిధాల నరకులాటలు జరుగుతూవున్నవి. అలా చూస్తారేమి? అక్కడ పోట్లాట జరుగుతూవున్నది. కత్తులతోనూ తుపాకీలతోనూ ఘోరయుద్ధం జరుగుతూ వున్నది.

వీర—ఎవరు పోట్లాడు చున్నారు?

మాధ—అందరూ పోట్లాడుతూవున్నారు. నేను యెరిగినవారందరూ పోట్లాడుతూ వున్నారు. నాయజమానుడూ పురుషోత్తమదేవుడుగారూ మీకోమారుడూ—

వీర—ఓహోహో! వానిమాయలు నేనిప్పుడు గ్రహించినాను.—నీ వాస్థల మెఱుఁగుదువా?

మాధ—రాజుగారి పొలములు.

వీర—నీ వక్కడకు దారి యెఱుఁగుదువా?

మాధ—యెరగను. నేను వెళ్ళితలారులనూ దండాధికార్లనూ గ్రామస్థులనూ అందరినీ తీసుకువస్తాను. అందరమూ చేరితేనేగాని యుద్ధం ఆపలేము.

వీర—నీవు నావెంటరా. మనము పోవునప్పు డెదురుపడిన వారిని తోడు తీసికొని పోదము—ఓరి బొంకులమారి గాడిదా! ఇదా నీకడియాలజతయొక్క వృత్తాంతము? నాకు కోపము వచ్చుచున్నది. నాకంటఁబడ్డ తరువాత నీపని పట్టించెదను.

(ఇద్దఱు నిష్క్రమించుచున్నారు)

---

3. రంగము—రాజుగారి పొలములు

[పురుషోత్తమదేవుఁడును, దామోదరవర్మయు తుపాకులు చేతఁబట్టుకొని ప్రవేశించుచున్నారు]

దామో—ఓ పురుషోత్తమదేవా! నా భుజశౌర్యముతోడు! నలువది గజములు మంచిదూరము. అది గుఱికి మంచిదూరము.

పురు—పెద్ద తుపాకులకంత దూరము కావలెనుగాని యీ చిన్న తుపాకుల కక్కఱలేదు. ఆ యేర్పాటులన్నియు నాకు విడిచిపెట్టు. ఇటువంటి విషయములలో నీకంటె నాకెక్కువ యనుభవము. దూరము నీకు చూపెదను చూడు. (అని యడుగులు వేయుచు) ఈ దూరము చాలును.

దామో—చాలదు. ఇంతకంటె మన మిఱుకుగదిలోనే పోట్లాడవచ్చును. పురుషోత్తమదేవా! నామాటవిను. విరోధి నాకెంతదూరములోనున్న నేనంత సూటిగా గుఱిపెట్టఁగలను.

పురు—మేలు మేలు! అతఁడు నీకంటికే కనఁబడకపోయిన యెడల మఱెంత యెక్కువ సూటిగా గుఱిపెట్టఁగలవు కాఁబోలును!

దామో—అది కాదుగాని మా యిద్దఱికిని మధ్య నలువదియో యెనుబదియో గజముల దూర ముండవలెను.—

పురు—అక్కఱలేదు. మూఁడు నాలుగడుగుల దూరము చాలును.

దామో—గుండుదెబ్బకా మూఁడునాలు గడుగులదూరము? అంత చేరువనుండి నేను శత్రువును జంపినపక్షమున గొప్పతనమే లేదు. నా మనవి విని నన్ను నా శత్రువును దూరమునుండియే పడ వేయనిమ్ము.

పురు—ఆవిషయము నేనును నీశత్రునియొక్క సహాయుఁడును నిర్ణయము చేసికొందములే. దామోదరవర్మా! ఈయుద్ధములో నీకొక వేళ నపాయము తటస్థించెడుపక్షమున, నేను నీనిమిత్తము చేయవలసినపని యేమి? నీ వేమయిన మరణశాసనము వ్రాసితావా?

దామో—నీకు నామీఁదఁగల దయకు సంతోషించినాను గాని నీమాటలకు నాకర్థము కాలేదు.—

పురు—తుపాకులు కాల్చుకొన్నప్పు డుభయయోధులలో నెవ్వరికైనా గుండుదెబ్బ తగిలి ప్రాణాపాయము సంభవింపవచ్చును. ఒకవేళ గుండుదెబ్బ నీకే తగులుట తటస్థించినపక్షమున, గృహకృత్యములను గుఱించి వ్యవహారము చక్కపెట్టుకొనుటకు నీకప్పుడవకాశ ముండదు.

దామో—అలాగునా?

పురు—నీకు ప్రాణాపాయము సంభవించినపక్షమున, నీశరీర

మును నూనెలో వేసి మీయూరికి పంపవలెనా? ఇక్కడనే పాతి పెట్టించవచ్చునా?

దామో—నూనెలో వేయుటా! పాతిపెట్టుటా! పురుషోత్తమ దేవా! నీవటువంటి యశుభ వాక్యములు బలుకఁగూడదు.

పురు—దామోదరవర్మా! ఈవఱ కెప్పుడును నీ విటువంటి వ్యవహారములలో ప్రవేశించి యుండలేదు కాఁబోలును!

దామో—వెనుక నే నిటువంటి వ్యవహారము లెప్పుడు నెఱుఁగను.

పురు—అయ్యో! నీ స్థితి నాకు విచారకరముగా నున్నది. అనుభవముతో సాటియైనది లోకములో మఱియొకటి లేదు. నీప్రతి వీరుని యొక్క గుండుదెబ్బ నెట్లు కాచుకొనెదవో నేఁడు చూతము.

దామో—కాచుకొను విధము నాకు తెలియును. ఆవిద్యలో నేను పండితుఁడను. ఇదిగో చూడు. నేనీలాగునఁ గాచుకొనెదను. (అని మూలకు తొలఁగి శరీరము ముడుచుకొని దాఁగుచున్నాఁడు.)

పురు—నీవు బొత్తిగా చాటునకుఁ బోయినావు. చూడు. (తుపాకి గుఱిపెట్టినట్లు చాచుచు) ఇదిగో నేను గుఱి—

దామో—పురుషోత్తమదేవా! ఆగు. ఆగు. నీ తుపాకికి గుఱ్ఱము తగిలించలేదుగదా? తిన్నగా చూచితివా?

పురు—భయపడఁబోకు.

దామో—భయపడలేదు. అవునుగాని—నీకు తెలియదు— గుండు తనంతనే లోపలినుండి యెగిరి పైకి రావచ్చును.

పురు—అలాగున నెప్పుడును జరగదు. నీకేమియు భయము లేదు. నేను గుఱిచూచి కాల్చినప్పుడు గుండు నీ యాయువు పట్టున తగులక తప్పిపోయెనా—

దామో—ఆయువుపట్టా? నాదా?

పురు—మాటాడకు. కదలక నేను చెప్పినట్టు నిలుచుండు. (అని రెండుచేతులతోను రొమ్ము పట్టుకొని నిలువఁబెట్టి) నీవక్షస్స్థల మెప్పుడును శత్రువువంకఁ బెట్టి నిలువఁబడు. ఈవలినుండి యావలికి రెండు మూడు గుండ్లు నీ రొమ్ములోనుండి దూఱిపోయినను, అందు వలన నీకు నష్టమేమియు లేదు.

దామో—రెండుమూడు గుండ్లు నారొమ్ములో నుండి దూఱునా?

పురు—దూఱిపోవుచ్చును. అంతకంటె మఱేమియు జరగదు.

దామో—పురుషోత్తమ దేవా! నావంకఁ జూడు. ఈవంకర మార్గములు నాకు పనికిరావు. ప్రతివీరుని యొక్కగుండు తిన్నగావంక రగా వచ్చునప్పుడు నే నెదురుగా ప్రక్కకు తొలఁగి నిలువఁబడెదను. నాకత్తితోడు! నే నోరసిల్లియే నాశౌర్యమును జూపెదను.

పురు—తుదకు వారు రాక మన కాశాభంగము కలుగఁ జేయుదురు కదా? రాక మానరు—(ఆవంకఁ జూచి) అదిగో! వారు వచ్చుచున్నట్టున్నారు.

దామో—ఏమీ! వచ్చుచున్నారా?

పురు—అదిగో! దూరముగా పొలముగట్టు దిగుచున్నారు.

దామో—వారిద్దఱున్నారు. రానిమ్ము. మనము-మనము-మనము పాఱిపోమ్ము.

పురు—పాఱిపోవుటా?

దామో—కాదు కాదు. నాశౌర్యముతోడు మనము పాఱిపో మనియే నే నన్నాను.

పురు—ఏమి? వడఁకుచున్నా వేమి?

దామో—మఱేమియు లేదు, నేను నిశ్చలముగా నున్నాను. ఎందుచేతనో కాని నా వెనుకటిధైర్యముమాత్ర మిప్పుడు నన్ను విడచి పరుగెత్తు చున్నది.

పురు—చీచీ! నీగౌరవమాలోచించుకో.

దామో—నా గౌరవమా? అవునవును. నీవు నడుమ నడుమ నాగౌరవమునుగూర్చి రెండుమూ డుత్సాహవచనము లనుచుండు.

పురు—(ఆవంకఁ జూచి) వారీవంకనే వచ్చుచున్నారు.

దామో—పురుషోత్తమదేవా! నీవు వద్ద లేక పోతివా, భయమువచ్చి నామీఁద పడును. ఇప్పుడు ధైర్యము మాటిమాటి నావద్దకు వచ్చును పోవుచున్నది. నా ధైర్యము నన్ను విడిచెరా—

పురు—ఈసారి నీవద్దకు వచ్చినప్పుడు నీధైర్యమును విడువక గట్టిగా పట్టుకో.

దామో—ఓమిత్రుఁడా! నా ధైర్యము నన్ను విడిచి పోవుచున్నది. మరల నావద్దకు వచ్చునట్లు లేదు. అవునవును. అంతకంతకు దూరమగుచున్నది. నాచేతులలోని బలమంతయు లాగుకొని మఱి పోయినది.

పురు—నీగౌరవము. నీగౌరవము మాట చూచుకో. వారు సమీపమునకు వచ్చినారు.

దామో—ఓభగవంతుఁడా! నన్ను రక్షించు. ఈసమయము నందు నేను మాయింటియొద్ద నున్న నెంతో బాగుండిపోవును. నే నీమాట లనుచుండఁగానే గుండుదెబ్బ తగిలి నాప్రాణము లెగిరిపోవునేమో!

దర్పసారుఁడును, విక్రమసేనుఁడును ప్రవేశించుచున్నారు.]

పురు—ఓహోహో! విక్రమసేనుఁడుగారా? నా వలె నే

మీరును మీమిత్రునికి సహాయులుగా వచ్చినారు కాఁబోలును! మొట్టమొదట మిత్రునిపని అయినతరువాత కడపట మనసొంతపని కావచ్చును.

దామో—ఏమి నామిత్రుఁడు విక్రమసేనుఁడా? ఓయీ విక్రమసేనా!

విక్ర—దామోదరా! విన్నావా? విజయపాలుఁడు నీవద్దకు వచ్చినాఁడు.

పురు—దామోదరవర్మా! ఇతనిని గౌరవముతో చూచి నందుకు నిన్ను నేను నిందింపను —(దర్పసారునివంకఁజూచి) ఓవిజయపాలా! మీరు మీయాయుధములు ధరించినపక్షమున, విక్రమసేనుఁడును నేనును దూరము కొలిచెదము.

దర్ప—నాయాయుధములా?

దామో—ఇదేమి? పురుషోత్తమదేవా! నేను దర్పసారునితో పోట్లాడుటకు రాలేదు. వీరిద్దఱును నాప్రాణమిత్రులు.

పురు—అయ్యా! మీరిక్కడకు దామోదరవర్మతో పోట్లాడుటకు రాలేదా?

దర్ప—నేను రాలేదు.

పురు—నాకు మహావిచారముగా నున్నది. దర్పసారా! ఇక్కడకు మనముముగ్గురమును పోరాడ వేడుకపడివచ్చినవారమగుటచేత నీ వూరక కూరుచుండి వేడుకను భంగము చేయవని తలఁచెదను.

విక్ర—దర్పసారా! ఈపురుషోత్తమదేవునిమాట తీసివేయక యుద్ధము చేయును.

దర్ప—దామోదరవర్మ కిష్ట మున్నపక్షమున—

దామో—లేదులేదు. నాకిష్టములేదు. నాయవమానమును

నేను ఋషివలె సహించి శాంతత సహించి యూరకుండఁగలను. వీరితో పోరాడుటకు నా కేమియు నావశ్యకము లేదు. నీకుకూడ లేకపోయిన పక్షమున మనము సుఖముగా వెడలిపోవచ్చును.

పురు—దామోదరవర్మా! నామాట విను. నన్నూరక యవమానపఱుపరాదు. నీవు నిశ్చయముగా నెవ్వరినో యుద్ధమునకు పిలిచి వారితో పోరాడుటకయి యిక్కడకు వచ్చినావు. ఇప్పుడు నీ శత్రువుయొక్క ప్రతినిధిగా వచ్చి యీతఁడు యుద్ధము చేయుట కిష్టపడి యున్నప్పుడు, నీవేల యొప్పుకొనఁగూడదో నాకు హేతువు తెలియకున్నది.

దామో—పురుషోత్తమదేవా! నేను చెప్పునది విను. నేను విజయపాలుఁడను వానిని యుద్ధమునకు పిలిచినాను. అతఁడు నాయెదుట తన మొగము చూపుట కెట్లు సాహసింపలేకపోయినాఁడో నీవే చూచుచున్నావుగదా? అతఁ డిక్కడకు వచ్చిన పక్షమున, నేను తత్క్షణమాతనిని తన కృషిని విడుచునట్లు చేసెదను.

విక్ర—దామోదరవర్మా! నీకు భ్రమ నివారణము చేసెదను విను. విజయపాలుఁడను పేరుగలవాఁ డెవ్వఁడును లేఁడు. ఆ పేరు పెట్టుకొన్న పురుషుఁడిదె యిప్పుడు నీయెదుటనే యున్నాఁడు. ఈ రెండు వేషములలోను గూడ నతఁడు చేయుచున్న కృషి యొక్కటియే యయినందున, అతఁ డా కృషిని విడువక పోరాడుటకయి యిచ్చట సంసిద్ధుఁడుగా నున్నాఁడు.

పురు—నీ వదృష్టవంతుఁడవు. నీ కిప్పుడు మంచి యవకాశము తటస్థించినది—

దామో—లక్ష వరహాలిచ్చినను నేను నా ప్రాణసఖుఁడయిన విక్రమసేనునితో పోరాడుదునా? ఇతను నూఱు విజయపాలసేన

ములు వేసినను నేను తగవులాడను. పురుషోత్తమ దేవా! నే నెన్నఁడైన మానుష స్వభావము విడిచి క్రూరకర్ముఁడ నగుదునా?

పురు—దామోదరవర్మా! నీవద్ద పౌరుషము లేదు.

దామో—కావలసినంత యున్నది. నా పౌరుషమును పరీక్షించి చూడవలెనన్న పక్షమున, నీవు ప్రధాన వీరుఁడవుగానుండి నన్ను నీకు సహాయునిగాఁ జేసికొమ్ము. నీ శరీరము నిక్కడనే పాతిపెట్టవలెనో, నూనెలో వేసి మీ యూరు పంపవలెనో మఱి మఱి యేమి చెయ్యవలెనో చెప్పితివా నేను సంతోష పూర్వకముగాఁ జేసెదను.

పురు—చాలు. చాలు. నీవు వట్టి రణభీరుఁడవు.

దామో—మిత్రులారా! ఇతఁడు న న్నేమనుచున్నాఁడో మీరు వినుచున్నారా? నేను రణభీరుఁడనఁట!

పురు—అవును. ఆమాట నేను నిన్నన్నాను.

దామో—రణభీరుఁడని నీవిప్పుడన్నమాట నేను పాటిగాఁ బట్టను. నీవా మాట కోడిగమున కన్నావు. ఆమాట కాక నీవు నన్ను కల్లరియని పిలిచినపక్షమున—

పురు—పిలిచిన నేమి చేసెదవు?

దామో—నీవు మాటమర్యాద యెఱుఁగని గ్రామ్యుఁడవని తలఁచెదను.

పురు—నేను నీమాటయందు గడ్డిపరకంత గౌరవ ముంచను.

విక్ర—పురుషోత్తమ దేవా! నా మిత్రుఁడయిన దామోదర వర్మకంటె మంచి సహాయుఁడు నీకు మఱియొకఁడు దొరకఁబోఁడు. ఇతఁడు ముక్కలకండలు కోఱికెడు మహావ్యాఘ్రము! నాటున నితని నందఱును నసహాయశూరుఁడని పిలుతురు. ఇతఁ డొక్కొక్క మను

ష్యుని నొక్కొక్క వారము దినములు బాధపెట్టి చంపును.— దామోదరవర్మా నీవట్టి వాఁడవవుదువా?

దామో—అవును. ఇంటివద్దనున్నప్పుడు నేనట్టివాఁడనే.

పురు—మంచిది! విక్రమసేనా! ఇప్పుడుమంచిపనియారంభము కావలెను. నీ విటురమ్ము.—(అని యొఱనుండి కత్తిని దూసికొని) నీవు యుద్ధము చేయవలసినపని లేక యితఁడా చిన్నదానిని నీకు వదలివేయునో లేదో ముందుగా నడిగి తెలిసికో.

విక్ర—అట్లయిన పక్షమున నీవిటురా—(అని కత్తిదూసికొని) సంధి నీ కిష్టము లేనట్టున్నందున, ఇదిగో కత్తితో నేను నీ కుత్తరము చెప్పుచున్నాను.

[వీరసేనుఁడును, మాధవుఁడును, సుభద్రమ్మయు, కళావతియు, చారుమతియు, ప్రవేశించుచున్నారు.]

మాధ—ఓవీరసేనా! వాళ్ళనందరినీ పడగొట్టండి. ముఖ్యంగా నా యజమానుణ్ని కొట్టి యిటువంటి కలహాలకు దిగకుండా బుద్ధి చెప్పండి.

వీర—విక్రమసేనా! ఊరకుండు. ఊరకుండక పోయినయెడల నీమీఁద నాకు దురాగ్రహము వచ్చును జుమా!—ఈ ద్వంద్వ యుద్ధము నీకెట్లు తటస్థమైనది?

విక్ర—ఆ విషయమయి యితఁడు నాకంటె చక్కఁగా చెప్పఁగలఁడు. నన్ను యుద్ధమునకుఁ బిలిచినవాఁడితఁడు. నేను రాజపురుషుఁడనని మీరే యెఱుఁగుదురుగదా!

వీర—వీఁడు మహాఘనుఁడు. వీడు కత్తితో నొకరిగొంతు కోయఁబోవుచుండఁగా నేను పట్టుకొన్నప్పుడు నాకు తాను రాజపురుషుఁడనని చెప్పుచున్నాఁడు—ఓరీ! రాజుగారు జన సంరక్షణము నిమి

త్తము నీకిచ్చిన యాకత్తిని రాజుగారి ప్రజల గొంతుకలు కోయుట కయి నీవేల యుపయోగించుచున్నావు?

విక్ర—అయ్యో! నేను నిజము చెప్పెదను చిత్తగించుఁడు. కారణమును జెప్పకయే యితఁడు నన్ను తనతోడ యుద్ధమునకుఁ బిలిచినాఁడు.

వీర—నీవు కారణమును జెప్పకయే నాకొడుకు నేల యుద్ధమునకుఁ బిలిచినావయ్యా?

పురు—నా గౌరవమునకు భంగము కలుగునట్లుగా నన్నీకొడుకవమానపఱచినాఁడు.

వీర—ఓరీ! ఈయన గౌరవమునకు భంగము కలుగునట్లుగా నీవీయన నేల యవమానపఱచినావు?

సుభ—రండి. రండి. స్త్రీల సమక్షమందు మీరు మీమీ గౌరవముల నిమిత్తము పోరాడఁగూడదు.—విక్రమసేనా! ఇటురమ్ము.—మీరింత నిర్భయముగా మాకేల యాయాసము కలుగఁజేయుచున్నారు?—నీనిమిత్తమయి భయముచేత కళావతి ప్రాణములు విడువబోవుచున్నది.

విక్రే—నేను బ్రతికిపోదునన్న భయముచేతనా? చచ్చిపోదునన్న భయముచేతనా?

సుభ—కాదు కాదు. వెనుకటిదానినిబట్టి భ్రాంతిపడఁగూడదు. కళావతి యిప్పుడు దృఢనిశ్చయురాలయియున్నది.—అమ్మాయీ! నీవు చెప్పు.

పురు—అమ్మా! మీసెలవుపొంది నేనొక్కమాట యడుగవలసియున్నది. ఇప్పుడొక్కప్రశ్న వేసి నేనీ చిన్నదాని మానవ్రతమునకు భంగము గలుగఁ జేయవలెను.

కళా—మీరు నన్నేమి యడుగఁదలఁచుకొన్నారు?

పురు—రమ్మురమ్ము. రాధా! ఇటురమ్ము. పరిహాసము మానివేసి మనమిప్పుడు గంభీరముగా మాటాడవలెను.

కళా—అవును మీరు చెప్పినది సత్యము. అందుచేత నే నిప్పుడు నావక్రభావమును మానివేసి యీ కరగ్రహణము చేసి నన్ననుగ్రహింప వలెనని యీశునను వేఁడుకొనవలెను.

విక్ర—నాభాగ్యదేవతా! నీనోటినుండి యిప్పు డమృతోపమానమైన శుభవాక్కు వచ్చినది.—ఓపురుషోత్తమదేవా! నా బుద్ధికిఁజూడఁగా నీకు నేను జేసితి ననుకొనుచున్న యవమానవిషయమయి యేదో భ్రమయున్నట్టు తోఁచుచున్నది. నేను బుద్ధిపూర్వకముగా నీ కేమియు నవమానము చేసి యుండలే దని మాత్రము నేను జెప్పఁగలను. సమయము వచ్చినప్పుడు మానమును నిలుపుకొనుటకయి పోరాడుటకు నేను వెనుకఁదీయువాఁడను కావని నీవీవఱకే కనిపెట్టి యున్నావు. భ్రమ కలిగినప్పుడు నిజ మొప్పుకొనుటకు సహితము నేను సందేహించువాఁడను గా నని నీ విప్పు డెఱుఁగవలెను. కాఁబట్టి నీకిప్పుడు నేను క్షమార్పణము చేయుచున్నాను. అయినను నన్నిప్పు డీచిన్నది యంగీకరించి గౌరవించుచున్నదిగాన, ఈమెను దక్కించుకొనుటకయి యే పౌరుషశాలి నాతోఁ బోరాడఁ బ్రతిఘటించినను నే నాతనితో యుద్ధముచేసి యీమెను విజయలక్ష్మితోఁగూడ వరించుటకు సంసిద్ధుఁడనై యున్నాను.

వీర—విక్రమా! నీ విప్పుడు వీరులు శ్లాఘింపఁదగిన మాట పలికినావు. నేనుగూడ నీపక్షమున నిలిచి నీకు సహాయుఁడనయ్యెదను.

దామో—నే నీ చిన్నదానిని నీకు విడిచిపెట్టుచున్నాను. ఈ ప్రపంచమంతయు వచ్చినను నాకీచిన్న దక్కఱలేదు. పోరాటము

లేక నాకు భార్య లభింపకపోయెడు పక్షమున, నే నెల్లకాలమును బ్రహ్మచారిగానే యుండెదను.

పురు—విక్రమసేనా! నన్నాలింగనము చేసికొమ్ము. చేసిన తప్పు నొప్పుకొని యర్హరీతిని క్షమార్పణము చేసినప్పుడు శత్రుండయినను మిత్రుండగును. ఈచిన్నది స్వహస్తఖితము లయినయీ యుత్తరములు నావిషయమయి తాను వ్రాసిన వగునునో కావనునో—(అని యుత్తరములు బయికి తీయుచున్నాడు.)

సుభ—(తనలో) ఓయి దేవుండా! ఇతం డిప్పుడు నా గుట్టు బయలం బెట్టును గాంబోలును!—(ప్రకాశముగా) 'పురుషోత్తమ దేవా! ఇందులో నేదో భ్రమయున్నది. నీభ్రమను నేను తరువాత సావకాశముగా నివారణము చేయంగలుగుదు—

పురు—నీతో సంబంధము లేనప్పుడు పెద్దదానవు నీవీవిషయములో మధ్య ప్రవేశింపంగూడదు.—ఓకళావతీ! నీవు నారాధవగుదువా? కావా?

కళా—కాను. నిశ్చయముగా నేను నీరాధను గాను.

(అని విక్రమసేనుని యండను జేరి నిలుచున్నది.

సుభ—ఓ పురుషోత్తమదేవా! నీవెంత నిర్దయుండవయి యున్నను నీయందు ప్రేమవూనిన నాయపరాధమును నేనొప్పుకొనెదను. నన్ను క్షమింపుము. నీరాధను నేను.

పురు—ఓసి! నీవా రాధవు? ఇంక దూరముగా తొలంగిపో.

సుభ—ఓరి కిరాతుండా! ఆయుత్తరములు నేను వ్రాసినవి. నీయం దిప్పుడు రసికత్వ మణుమాత్ర మయినను కనంబడినపక్షమున నిన్ను ధన్యుని జేయుటకు నేను గొంచె మాలోచించి యుందును.

పురు—ఓసుభద్రమ్మా! నీవు చూపఁదలఁచుకొన్న యనుగ్రహమునుగూర్చి నేను మిక్కిలి కృతజ్ఞుఁడనయి యున్నాను. నన్నట్లు మోసముచేసినది నీవైనను మీ మంథర యైనను, మీ యిద్దఱి యుపకార ఋణమును నేను తీర్చుకోలేను—విక్రమసేనా! ఆచిన్న దానిని నీవు నావద్దనుండి పరిగ్రహించినావు గనుక, నేను కృతఘ్నుఁడను కానని చూపుటకై బేరములో నారాధను గూడ నీకే కొసరుగా విడిచిపెట్టుచున్నాను.

విక్ర—పురుషోత్తమదేవా! నీ యౌదార్యమునకు సంతోషించినాను. ఐనను నేఁడు భార్య లేకున్నవాఁడు రణశూరుఁడైన నాప్రియమిత్రుఁడు దామోదరవర్మ—

పురు—ఆహాహాహా! ఓరణశూరా? నీ కిప్పు డేమయిన ధన్యుఁడవు కావలెనన్న తలం పున్నదా?

దామో—ఈముదిముడుతలా? నా కక్కఱ లేదు—ఓ పురుషోత్తమదేవా! నన్ను క్షమించు. ఇంకొకసారి నీకు మరల నేను నాశరీరమును నూనెలో వేసి కాపాడుట కవకాశము కలుగఁ జేసిన పక్షమున, నన్నప్పుడు దామోదరవర్మ పిఱికివాఁ డని నీవు పరిహసింతువుగాని లే.

వీర—సుభద్రమ్మా! ఇటు రా! విచారపడఁబోకు. నీ వింకను వయసులోనే యున్నావు.

సుభ—ఓవీరసేనా! మగవాం డ్రందఱును పశుప్రాయులు.

[చారుమతియు, దర్పసారుఁడును తక్క నందఱు
నిష్క్రమించుచున్నారు.]

చారు—(తనలో) ఇతఁడు నిరుత్సాహుఁడయి ఖేదపడుచున్న ట్టున్నాఁడు. అయినను కొంచెమైన నలాడుచున్నట్టుమాత్రము లేఁడు.

అతఁడు చెప్పినకథలో కొంతసత్యముకూడ నున్నది.—ఓ యాఁడు స్వభావమా! నీ వింత చంచలమైనదానవై యున్నప్పుడు నీమనో నిశ్చయ మెంత న్యాయమైనదిగా నుండవలెను!

దర్ప—చారుమతీ! నేన ర్హుఁడనని యెఱిఁగియు ని న్నెట్లు దయచూపు మని వేడఁగలుగుదును? నిన్ను ప్రార్థించుటకు నాకు సాహసము చాలకపోయినను, నాపశ్చాత్తాపము నన్నాకలపాలు చేయుచున్నది.

చారు—దర్పసారా! ప్రేమాస్పదు లైనవారు తప్పు చేసినప్పుడు క్షమింపనొల్లని నాదానికంటె నన్నాదరము చేసిననీది గొప్పతప్పిదము కాదు. నాదౌర్బల్యమునకుఁ దగినక్షమార్పణమును ప్రేమపూర్వకముగాఁ జేయవలసిన దని నామన స్సిప్పుడు నాకు హితబోధ చేయుచుండఁగా, నీదౌర్బల్యమును నేను క్షమింపనియెడల నేను కృతఘ్ను రాల నగుదును.

దర్ప—నే నిప్పుడు కృతార్థుఁడ నయినాను.

వీర—(ముందుకువచ్చి) ఇక్కడ మీ రేమిచేయుచున్నారు? మీరుకూడ మీలో తగవులాడుచున్నారాయేమి? చారుమతీ! ఇటు రమ్ము. ఈవఱకు నే నేవిషయములోను నిన్ను నిర్బంధపెట్టలేదు. ఐనను నే నిప్పుడుమాత్రము నిన్నొకవిషయమై బలవంతపెట్టఁబోవుచున్నాను. నే నెఱిఁగినంతవఱకు దర్పసారుఁడుచేసినతప్పిదములన్నియు నీయం దితనికిఁ గలయత్యనురాగమువలనఁ గలిగినవే కాని వేఱుకారణముచేతఁ గలిగినవి కావు. ఇఁక నామాట కెదురాడక తత్క్షణ మీతనిని వివాహము కమ్ము. ఇఁక నితఁడు తనలోపములను జక్కపఱచుకొను విధమును జూచి నీవే యాశ్చర్యపడఁగలవు.

[తక్కినవారు ప్రవేశించుచున్నారు.]

పురు—రండి. ఒక్కఁడుతప్ప మఱి యెవ్వరు నిక్కడ సంతుష్టులు కానివారు లేరు. నేనుమాత్ర మసంతుష్టుఁడ నయినను మీ యందఱును సంతుష్టు లగుట నేత్రోత్సవముగా చూచి నేనును సంతుష్టుఁడ నయ్యెదను.

దామో—పురుషోత్తమదేవా! నీవన్నమాట శ్లాఘ్యముగా నున్నది. వీరిసంతోషము చూచి మనము సంతోషింతము.—విక్రమసేనా! నీకు చిరసౌఖ్యము కలుఁగుఁగాక!—దర్పసారా! అట్లే నీకును గలుగునుగాక!—ఓ కాంతలారా! మీరందఱునురండి. మీసౌఖ్యమును జూచి నేనెంతమాత్రమును కోపముగాని యసూయగాని యతృప్తిగాని పొందునట్లు మీకుఁ జూపుటకై నేఁడు మీకందఱికిని గీతవాద్యములతో మాయింట విందు చేసెదను. మీరందఱునుతప్పక వచ్చి నన్ను చరితార్థునిఁ జేయవలెను.

వీర—ఓయీ! నీయుత్సాహమునకు నేను సంతోషించినాను. నేటిరాత్రి యీదంపతులయొక్క యాయురారోగ్యములుకోరి మనము విం దారగింతము.

దర్ప—విక్రమసేనా! మన ప్రియురాండ్రు మనదోషములనుండి మనలను విముక్తులను జేసి పరిశుద్ధులనుగాఁ జేసినందునకయి మన మానందపరవశుల మగుదుము. నీహృదయేశ్వరి యిఁకముం దెప్పుడును మాయలుపన్నకుండ నీకు బుద్ధిచెప్పి నిన్ను విశుద్ధుని జేసినది. నాప్రాణేశ్వరితనఋజువైనశాంతవర్తనముచేత నాయసంతుష్టికిఁ గారణమైన నాశంకాశీలతను రూపుమాపి నన్నకళంకుని జేసినది.

విక్ర—మన యిద్దఱమును కామదేవునియాగ్రహమును ననుగ్రహమునుగూడ సమానముగానే యనుభవించినాము. మనకిరువుర

కును గలభేదము మాత్రమిది. నీవు కష్టములకోర్చి సహింపఁగలిగియుంటివి; నేను—

కళా—గతించినదానిని త్రివ్వుకొని విచారపడుట కిది సమయము గాదు. మన మిప్పుడు గడచినదాని నంతను మఱచి మన సంతోషము నిష్కళంకముగాఁ జేసికొనవలెను.

యదు—ఇప్పుడుమాత్రమే కాక మీఁదెప్పుడునుగూడ మనము గతించినదానిని మరల తలపెట్టక యఖండసుఖమనుభవించుచుందము. యోగ్యము లయినహృదయములు వివాహబంధముచేత నొక్కటిగాఁ గూర్పఁబడినప్పుడు కామదేవుఁడు తా నావఱకు బాధించిన తనపుష్ప బాణముల నాదంపతులకు పూసరములుగాఁ జేసి యానందసౌరభ మెల్లప్పుడును గుబులుకొనునట్లు చేయును. మనవారు మననిమిత్తమయి వేచి యున్నారు. లోపలికిఁ బోదము రండు.

(అందఱును నిష్క్రమించు చున్నారు.)

బాను ప్రెస్, రాజమండ్రి 1950.

Prescribed as a Text-book for three year Degree Exam.
1960 Part I B of Sri Venkateswara University.

శ్రీ

అభిజ్ఞాన

శాకుంతల నాటకము

కందుకూరి వీరేశలింగము పంతులుగారిచే

కాళిదాసప్రణీతమైన సంస్కృత గ్రంథమునుండి

ఆంధ్రీకరింపఁబడినది.

ప్రకాశకులు:

హితకారిణీ సమాజము

రాజమహేంద్రవరము

1958

 [వెల రు 1-75 న.పై.

తొమ్మిదవ కూర్పు:
ప్రతులు 1000

అవంతీ ప్రెస్,
రాజమంద్రి.

మొదటికూర్పు పీఠిక

ఈ నాటకము మహాకవియైన కాళిదాసునిచే రచియింపఁబడి
నది. ఈతఁడు విక్రమాదిత్యుని యాస్థాన కవీశ్వరులలో నెల్ల నగ్ర
గణ్యుఁడు. గనుక ఈ నాటకము రచియింపఁబడి యిప్పటికి రమారమి
రెండువేల సంవత్సరములు కావచ్చినది. ఇది సంస్కృత నాటకములలో
బహు పురాతనమయినది. ఇప్పుడున్న నాటకములలో నొక్క
మృచ్ఛకటిక మాత్రమె దీనికంటె ప్రాచీనమయినది. సంస్కృతకవి
సార్వభౌముఁడని యెల్ల వారిచేతను శ్లాఘింపఁబడు కాళిదాసునిగాని,
ఒక్క హిందువులుమాత్రమేకాక నాగరికాగ్రేసరు లయిన యూరపు
ఖండ పండితులు సహితము నాటకరాజమని శిరసావహించి గౌర
వించు శాకుంతల నాటకమునుగాని, నే నిప్పుడిచ్చట శ్లాఘింపవలసిన
యావశ్యకము లేదు. గీర్వాణభాషలోఁగల నాటకములలో నెల్ల సర్వో
త్కృష్టమయిన యీ యభిజ్ఞాన శాకుంతలమును రసవంతముగా తెనిఁ
గింపఁగల సామర్థ్యము నావద్ద లేనిసంగతి పూర్ణముగా నెఱిఁగినవాఁడ
నయ్యును, అట్టి నాటకమును జదివినమీఁదట దానిని తెనిఁగింపవలయు
నని నా మనస్సులో పుట్టిన బుద్ధి చాపలమును మరలించుకోలేక
నా శక్తిని విచారింపక సాహసము చేసి యీ మహాకార్యమున కారం
భించినాఁడను. ఒకవేళ జనుల కీ పుస్తకము సంతోషజనకముగానే
యున్న యెడల, ఇందు నా కల్పన మేమియు లేక సర్వమును కాళి
దాసునిదే యగుటవలన నా మహాకవిని మెచ్చవలయునే కాని నన్ను
శ్లాఘింపవలసిన పని యెంతమాత్రమును లేదు. ఇట్లని నా లోపమువలన
తిన్నఁగా నుండని విషయములకెల్లను కాళిదాసునే యుత్తరవాదినిగాఁ
జేసి తప్పించుకొన నెంచినట్లు దీనిం జదువువా రెంచఁగూడదు. దీని

యందుఁగల దోషములన్నియు నావియే కనుక తమ కేవేని లోపములు కనఁబడినచో పండితజనులు నా యసమర్థతను మన్నింతురని ప్రార్థించుచున్నాను. మఱియు, నీ తెనుఁగునుబట్టియే కాళిదాసుని రచనానైపుణ్యమును నిర్ణయించుకొనక యిది యొకవేళ హృదయాహ్లాదకరముగా నుండకపోయినను మూలగ్రంథ మత్యంత శ్లాఘాపాత్రముగా నుండునని యే నమ్మి యా మహాకవియెడ పరిపూర్ణ గౌరవము నుంచుదురని నమ్ముచున్నాను. నే నీ గ్రంథమును కొన్ని సంవత్సరముల క్రిందట నారంభించి మొదటి రెండంకములనుమాత్ర మాంధ్రీకరించి తరువాత కొన్ని కారణములచేత నప్పటి కంతటితో నిలిపినాఁడను. కాని రెండు మాసముల క్రిందట నా మిత్రులు కొంద ఱీ నాటకమును తెనుఁగుననాడుట యుచితముగా నుండునని తెలిపినందున, అందు నిమిత్తమయి మరల పనిపూని తక్కిన యైదంకములను కొంత తొందరగా వ్రాయవలసినవాఁడ నైనాఁడను. అప్పుడు మొదటి రెండంకములను కొంచెము కఠినశైలిలో వ్రాసినను నాటకమాడునప్పు డందఱకును దెలియుట యత్యంతావశ్యక మను నభిప్రాయముతో నిప్పు డీ యయిదంకములను మిక్కిలి సులభముగా వ్రాసినాఁడను. నే నీ గ్రంథమును తెనిగించుటలో బహు ప్రతులను జూచి మొట్ట మొదట నన్ని ప్రతులలోనున్న విశేషాంశముల నన్నిటిని జేర్పవలయునని యెంచి ప్రథమ ద్వితీయాంకములయందు కలకత్తా ప్రతియందు గల యధిక శ్లోకములనుగూడ జేర్చితినిగాని, తరువాత పరిశీలింపఁగా నట్టివి ప్రక్షిప్తలుగాఁ గానబడినందున తరువాత నట్టివానిని వదలివేసి బహు ప్రతులయందున్న రీతినే తక్కినభాగమును తెనిఁగించినవాఁడను; నాకు లభించిన నాలుగు భిన్న దేశ ప్రతులయందును గొన్ని భాగములు భిన్న భిన్నములుగా నున్నవి. అటువంటి స్థలములలో నా

బుద్ధి కేపాకము సరసముగా నున్నట్లు తోఁచినదో దాని ననుసరించి తెనిఁగించుచు వచ్చినాఁడను. విద్వాంసులు దీనియందలి లోపములను గనఁబఱిచినయెడల మరల ముద్రించునప్పుడు వందన పూర్వకముగా సవరించెదను.

రాజమహేంద్రవరము
ది ౨౫ అక్టోబరు ౧౮౮౩ సం॥ } కందుకూరి వీరేశలింగము.

మూడవకూర్పు పీఠిక

నే నీ నాటకమును తెనిఁగించి ౧౮౮౩ వ సంవత్సరాంతము నందు మొదటిసారి ముద్రించినాఁడను. ఇది ౧౮౮౯ వ సంవత్సరమునందు రెండవసారి ముద్రింపఁబడినది. ఈ సారి పుస్తకమునందు మూలగ్రంథానుసారముగా నక్కడక్కడఁ గొన్ని మార్పులను జేసి యున్నాఁడను. ఇఁక నైనను దెలుఁగువారు దీనియం దధికాదరమును జూపుదురని నమ్ముచున్నాను.

రాజమహేంద్రవరము
ది ౧౫ ఏప్రిల్ ౧౮౯౭ సం॥

కందుకూరి వీరేశలింగము.

ఈ నాటకమునందు వచ్చు పాత్రములు

పురుషులు :

దుష్యంతుఁడు—కథానాయకుఁ డయిన పూరువంశపురాజు
మాధవ్యుఁడు—రాజునకు వేడుక చెలికాఁడు
కణ్వుఁడు—శకుంతలకు పెంపుడు తండ్రియగు మహర్షి
వైఖానసులు—కణ్వాశ్రమ ప్రాంతమునందలి ఋషులు
శార్ఙ్గరవుఁడు—కణ్వశిష్యుఁడు
శారద్వతుఁడు—కణ్వశిష్యుఁడు
మిత్రావసువు—రాజు బావమఱఁది; ఆరక్షకభటాధిపతి
రైవతకుఁడు—రాజు ద్వారపాలకుఁడు
కరభకుఁడు—రాజుతల్లి పంపిన భటుఁడు
సోమరాతుఁడు—రాజపురోహితుఁడు
జానకుఁడు—ఆరక్షకభటుఁడు
సూచకుఁడు—ఆరక్షకభటుఁడు
వాతాయనుఁడు—అంతఃపుర ద్వారపాలకుఁడు
మాతలి—ఇంద్రసారథి
భరతుఁడు—దుష్యంతుని పుత్రుఁడు
కశ్యపుఁడు—మరీచిపుత్రుఁడగు మహర్షి
కుంభీలకుఁడు—బెస్తవాఁడు

స్త్రీలు :

శకుంతల—దుష్యంతునిభార్య, కథానాయిక
అనసూయ—శకుంతల చెలికత్తె

ప్రియంవద—శకుంతల చెలికత్తె
గౌతమి—ఒక వృద్ధతాపసస్త్రీ
వసుమతి—దుష్యంతుని మొదటిభార్య
సానుమతి—శకుంతల చెలియైన యప్సరస
తరళిక—వసుమతి పరిచారిక
చతురిక—రాజుపరిచారిక
పరభృతిక—ఉద్యానవనపాలకురాలు
అదితి—కశ్యపుని భార్య
సువ్రత—ఒక తాపసస్త్రీ

వీరుగాక సారథి మొదలగువారు మఱికొందఱు వత్తురు.



కీ ర్తి శే షు లు

రావు బహదూర్ : కందుకూరి వీరేశలింగం పంతులు

శ్రీరస్తు

అభిజ్ఞాన శాకుంతల నాటకము

ఉపోద్ఘాతము

1. కవికాలము :

ఈ నాటకమును రచించిన మహాకవి కాళిదాసు. ఇతని నామము భారతీయ వాఙ్మయమున కింద్రజాలమువంటిది; కాని యీ మహాకవి యెప్పటివాఁడో, యెక్కడివాఁడో, యీతని జననాదికము లెట్టివో యిదమిత్థమని నిర్ణయింపరాక కేవల మూహ్యములయి మాత్రమున్నవి. ఇతఁ డుజ్జయినిఁ జెందినవాఁడనియు, విక్రమాదిత్య రాజాస్థానమున నితఁడు వెలసినట్లును బండిత సంప్రదాయము. ఇతఁడు బహు భోగ భాగ్యశాలియయి జీవితము గడపెనని పలువు రంగీకరించిన విషయము.

ఈ మహాకవి ఋతుసంహారము, కుమారసంభవము, మేఘ సందేశము, రఘువంశము అనెడి కావ్యములను, మాళవికాగ్నిమిత్రము, విక్రమోర్వశీయము, అభిజ్ఞాన శాకుంతలము అను నాటకత్రయమును రచించెను.

ప్రాచ్యపండితులుగాని, పాశ్చాత్యపండితులుగాని బాహ్యాంతర సాక్ష్యములను బట్టి కాళిదాసెప్పటివాఁడో చెప్పలేకపోవుట మన దురదృష్టము. "నవరత్నము" లనఁబడు తొమ్మండ్రు విక్రమాదిత్యు నాస్థానమున వెలసిరని చెప్పెడి "ధన్వంతరి క్షపణ కామరసింహ శంకు । వేతాళభట్ట ఘటకర్పర కాళిదాసాః । ఖ్యాతో వరాహమిహిరో నృపతేః సభాయాం । రత్నానివై వరరుచి ర్నవవిక్రమస్య" అను శ్లోకమును బురస్కరించుకొని, శాక్యకులమును నిర్మూలించినట్టి విక్రమశక

స్థాపకుఁడగు విక్రమాదిత్యుకాలము క్రీ. పూ. 56 కావుటచేఁ గాళిదా సప్పటివాఁడని సర్ విలియం జోన్స్‌గారి యూహ. ఇతర కారణము లను జూపి ఆప్టే పండితుఁడు జోన్సుగారి వాదముతో నేకీభవించు చున్నాఁడు. కాశ్మీరమునకుఁ జెందిన శ్రీహర్ష విక్రమాదిత్యుఁడు శాక్యులను బరిమార్చుట క్రీ. పూ. 457 కావున, కాళిదాసు జోన్సు చెప్పినదానికన్న సుమారు నాల్గువందల యేండ్లు ముప్పటివాఁడని శ్రీ టి. యస్. నారాయణశాస్త్రి గారి వాదము. కీత్ పండితుని యూహ ప్రకార మీకవి క్రీ. శ. 350 నాఁటివాఁడు. మోక్షమూలరు, ఫర్గూసన్ పండితులు కాళిదాసు క్రీ. శ. 544 ప్రాంతమునకుఁ జెందినవాఁడందురు. కాణేపండితుఁడు దాదాపు వాదముతో నేకీభవించుచున్నాఁడు. కాళి దాసునిగూర్చి ప్రప్రథమముగా ద్వితీయపులకేశి వేయించిన అయి హోల్ శాసనమునఁ బ్రశంసగలదు. ఈ శాసనము క్రీ. శ. 634 నాఁటిది. అతిప్రసిద్ధమగు మందసర శాసనమున వత్సభట్టికృతస్తుతి యున్నది. అద్దాన నుత్తమ శ్లోకము లనేకములు కాళిదాస కృతములగు ఋతు సంహార మేఘసందేశముల శ్లోకములకుఁ బోలికలుగ కన్పట్టును. ఈ వత్సభట్టిప్రశస్తి క్రీ. శ. 472 ప్రాంతములది. కొందఱు విమర్శకులు, మాళవికాగ్నిమిత్రములోని నాయకుఁడు శుంగవంశమునకుఁ జెందిన యగ్నిమిత్రుఁడని నిశ్చయించిరి. ఇట్టులనేకు లనేక విధములుగాఁ గ్రొత్త క్రొత్త సిద్ధాంతములను వెలిబుచ్చియున్నారు. మొత్తముమీఁద కాళి దాసు క్రీ. పూ. 56 నకుఁ దరువాతివాఁడనియు, క్రీ. శ. 400 లకుఁ బూర్వుఁడనియు మనము నిశ్చయించుటలో విప్రతిపత్తి యుండదేమో !

2. ఈ నాటక వ్యాఖ్యాతలు :

శాకుంతల మతి ప్రసిద్ధివడసిన నాటకము కావుటచే దీనికి వ్యాఖ్యాతలు పలువురు వెలసిరి. వారిలోఁ గొందఱు : అభిరామభట్టు, కాటయ వేముఁడు; కృష్ణనాథ పంచాననుఁడు, చంద్రశేఖరుఁడు,

నారాయణ రాఘవుఁడు, రామభద్రుఁడు, శంకరుఁడు, శ్రీనివాసుఁడు, ఘనశ్యాముఁడు, ప్రేమచంద్రుఁడు మొదలగువారు. వీరలలోఁ క్రీగీతలు గల పేళ్లు ఆంధ్రవ్యాఖ్యాతలవి.

కాటయవేముఁడు : ఇతఁడు కొండవీటి రాజ్యము నేలిన ప్రోలయ వేమారెడ్డికి (క్రీ. శ. 1324–1350) దౌహిత్రుఁడు. కుమారగిరిరెడ్డి (1383–1400) కి బావయు మంత్రియునై యుండెను. ఇతఁడు మహా పండితుఁడు. కాళిదాసీయ నాటకత్రయమునకు వ్యాఖ్యానమును, ఒక నాట్యశాస్త్రమును విరచించియున్నాఁడు. వీనికన్నిటికి "వసంతరాజీయము" అని పేరు. వసంతరాజని కుమారగిరిరెడ్డికి నామాంతరము.

శ్రీనివాసదీక్షితుఁడు : ప్రత్యంకాంతముననున్న "ఇతి శ్రీరమణ శ్రీ వేంకటాచలేశ్వర పాదారవింద సమారాధక వైఖానసకుల తిలక శ్రీ కౌశికగోత్ర శ్రీ తిరుమలాచార్య పుత్రేణ...శ్రీనివాసాచార్యేణ విరచితాయాం శాకుంతల వ్యాఖ్యాయాం..." అనుదానినిబట్టి తిరుపతి శ్రీ వేంకటేశ్వర దేవస్థానమున నితఁ డర్చకుఁడై యుండునని తెలియుచున్నది. ఇతనికి చక్రాయుధ బిరుదముగలదు. ఇతఁడు క్రీ. శ. 1850 ప్రాంతమువాఁడు. ఉన్నవానిలో నితని వ్యాఖ్య దీర్ఘతమము; అతని వైదగ్ధ్యమునకు నిదర్శనము.

3. ఈ నాటకమునందలి కథాసారము :

చంద్రవంశ చక్రవర్తి దుష్యంతుఁడు కణ్వాశ్రమోపాంతమున నొక సారంగమును వెన్నంటి తఱుముచు, నది ఋష్యాశ్రమమని తెలిసి తన యుద్దేశమునుండి విరమించును. అంత నా సమీపమున శకుంతల చెలికత్తెలతోఁ, లేఁదీగెలకు, వృక్షములకు, నీళ్ళు వోయుటను జూచును. ఆమె సౌందర్యమున కచ్చెరువంది యామెతో సంభాషించుట కిచ్చగించును. ఆమెకుఁ దనయెడ ననురాగ మున్నదని తెలిసి శకుంతలను గలసికొని వివాహ మాడును. ఆమెకుఁ దన యంగుళీయక మొసఁగి,

తాను పురము చేరుకొన్న క్షణముననే శకుంతలను బిలిపింతునని వాగ్దానముచేసి దుష్యంతుఁడు వెడలును. పరధ్యానములో నుండఁగా శకుంతల దుర్వాసమహామునిని సత్కరించుట మఱచును. ప్రియుఁ డీమెను విస్మరించునని శాపమిచ్చి యతఁడొసఁగిన యంగుళీయకమును జూపినచో శాపవిమోచన మగునని చెప్పి దుర్వాసుఁడు వెడలిపోవును. కొంతకాల మేఁగినపిమ్మట కణ్వమహర్షి శకుంతలను దుష్యంతునికడ కనుప నిశ్చయించును. శకుంతలయు దన చెలికత్తెలయు, ఆశ్రమ తరులతాగుల్మములయు, లేళ్ళయు ననుజ్ఞగొని బయలుదేరి దారిలో నంగుళీయకమును బోఁగొట్టుకొని, తుదకు రాజసభను జేరును. అచట శకుంతల దుష్యంతునితో నెంతగా వాదించినను వ్యర్థమే కాఁగా దుఃఖముతో రాజసభనుండి బయల్వెడఁగానే మేనక యామెను దేవలోకమునకుఁ దీసికొని వెళ్ళిపోవును. శకుంతల పోఁగొట్టుకొన్న యుంగరమొక బెస్తవానికిఁ దొరకి వాఁడద్దానిని నమ్మఁ జూచుచుండఁ దీస్పనకై రాజసముక్షమునకు నతనిని గొంపోవుదురు. ఉంగరమును జూచుటే తడవుగా, దుష్యంతుఁడు శకుంతలయెడఁ దానొనర్చిన యపరాధమునకు వగచుట కారంభించునుగాని తన పశ్చాత్తాపమునకుఁ బ్రతిఫలము గన్పించదు. ఇట్లుండఁ గొంతకాలమునకు నింద్రుఁడు శత్రుసంహారణార్థము దుష్యంతుని సాయమపేక్షించును. ఇంద్రునిరథమును నడుపుచుండఁగా నొక బాలుఁడు సింహకిశోరముతోడ నాటలాడుచుంటను జూచి యతఁడు తనకుమారుఁడు భరతుఁడేయని గ్రహించి, శకుంతలాపునఃసమాగమము కలుగ నీక నెన్నఁడామెను వదలిపెట్టననును.

4. ఇందలి విపర్యాసములు :

కాళిదాసీకథను సంస్కృత భారతమునుండి గ్రహించెను. శకుంతలోపాఖ్యానము మహాభారతమున నాదిపర్వమున 64 అధ్యాయమునుండి 74 అధ్యాయము వఱకుఁ గలదు. ఔచిత్య సంపాదనార్థమై కాళిదాసు

మూలకథకుఁ గొన్ని మార్పులు గావించి మెఱుఁగులు దిద్దియున్నాఁడు. ఇందు ముఖ్యములగు మార్పులివి :

(అ) నాయికానాయకుల యనురాగోత్పత్తి, తత్క్రమాభివృద్ధి విషయము : మూలమున, దుష్యంతుఁడు శకుంతల నొంటిగాఁ జూచి మోహించును. పుట్టఁబోవు కుమారునకు రాజ్యమొసఁగెదనని ప్రతినచేసి యామెను గాంధర్వవిధిని బెండ్లియాడి, తఱువాతఁ బిలిపించెద నని వెళ్ళి పోవును. నాటకమున నాయికానాయకుల ప్రేమ నిర్వ్యాజముగాఁ దోఁచును. అంతేగాదు. అది సహజముగాఁ బెంపొందినట్లు వేర్వేఱు భాగములందుఁ జూపఁబడినది. వీరి పరస్పరానురాగము, భావోదయము పరిపూర్ణత్వము వడయుటకేఁ గాఁబోలు, ఋషిపుత్రుల ప్రార్థనముపై నాశ్రమమునఁ గొంతకాలముండి వారివలన సెలవుగొని వెడలును.

(ఆ) దుర్వాసశ్శాపము: ఇది కాళిదాసు గావించిన మార్పులలో నతిప్రధానము. మూలకథయందు "పట్టణమునకేను జేరిన వెంటనే నిన్ను బిలిపింతును" అని రాజు శకుంతలతోఁ జెప్పినట్లు గలదు. కాని యట్లు చేయలేదు. తరువాత శకుంతల స్వయముగాఁ బుత్రునితో నెదురవచ్చి నిలువఁగాఁ దానామె నెఱుఁగననియు నిండుసభలో చెప్పెను. ఇట్లు చిత్రించుట నాయకపాత్రకు దోష మారోపించు టగును. తన్నివారణార్థము రాజు శకుంతలా వృత్తాంతము మఱచిపోవుటకుఁ గాళిదా సీదుర్వాసశ్శాపము కల్పించెను. రాజు నిర్దోషి యని పంచమాంకారంభము స్పష్టము చేయుచున్నది.

(ఇ) పుత్రోత్పత్తి : పుత్రునితో శకుంతల దుష్యంతు నొద్ద కేఁగినట్లు మూలమున నున్నది. శకుంతల గర్భముగా నున్నప్పుడే రాజ సభ కేఁగినట్లు, నచట నామె తిరస్కృత కాఁగా మరీచ్యాశ్రమమునకుఁ గొంపోఁబడి యచటఁ బుత్రుని కన్నట్లు నాటకమున మార్పుసేయఁ

బడియున్నది. తల్లిని గుర్తింపకపోయినను చక్రవర్తి చిహ్నాంకితుఁడును, అమిత సత్త్వుఁడును, దుష్యంతప్రతిముఁడు నగు సర్వదమనుని రాజు తన పుత్రునిగా గుఱుతింపకపోవుట అసంభవము" కావున కాళిదాసు చేసిన యీ మార్పు సరసము. ఈ మార్పు చేయకుండినచో నాటకమున సప్తమాంకమునకుఁ బ్రసక్తి లేదు.

(ఈ) శకుంతలాదుష్యంతుల పునస్సమాగమము హేమకూటమునఁ గశ్యపాశ్రమమున జరుగుట.

ఇవిగాక ప్రథమాంకమునందలి భ్రమర ప్రకరణమును, రాజును జూడ శకుంతల తనకాలికిఁ గుశ గ్రుచ్చెననియు, బట్ట చెట్టునకుఁ దగుల్కొనె ననియు మిషలు కల్పించి యాఁగుట, చతుర్థాంకమున శకుంతల పయన మగునప్పుడు లేడి యడ్డగించుట, పంచమాంకమున హంసపదిగానము. షష్ఠాంకమున ధనమిత్రుని మరణవార్త, మాతలి విదూషకుని పీడించుట, సప్తమాంకమున సర్వదమను కంఠమునఁగల తాయెతు మాహాత్మ్యము–ఇత్యాదులు నాటకమునకుఁ జెప్పరాని వన్నెగూర్చు కథాసన్నివేశములు. కాళిదాసు "ఈ చిన్న చిన్న వ్యాపారముల వలనఁ గథయొక్క పూర్వాపర సందర్భములను జక్కగాఁ గలుపుట యేగాక మానవునకుఁ దెలియకుండ మానవాంతఃకరణములో నుండునట్టి యుదాత్త భావములను మనోహరముగా వ్యక్తపఱచి యున్నాఁడు. గొప్ప మార్పులకంటె నిట్టి కొలఁది మార్పులలోనే రసభావములను జిత్రించునట్టి కవిప్రతిభ యొక్క మనోహరాకృతి దృగ్గోచర మగును." *

5. నాటక ప్రశస్తి:

ఈ నాటకము నుద్దేశించి, కాళిదాసుని ప్రశంసించుచు రవీంద్రుఁ డిట్లు వచియించియున్నాఁడు.

---

* ఆంధ్రవిజ్ఞాన సర్వస్వము. పుట 202.

"Kalidasa has shown that while infatuation leads to failure, beneficience achieves complete fruition, that beauty is constant only when upheld by virtue, that the highest form of love is the tranquil controlled and beneficient form, that in regulation lies the true charm and in lawless excess the speedy corruption of beauty. He refuses to acknowledge passion as the supreme glory of love; he proclaims goodness as the final goal of love"*

రెండు శతాబ్దములకు మున్నే యియ్యది పాశ్చాత్యవిద్వద్జ్ఞుల దృష్టి నాకర్షించినది. జర్మనీకిఁ జెందిన గేటె యనెడు సుప్రసిద్ధ తత్త్వజ్ఞుఁడీనాటకమును జదివి యానందమును బట్టలేక ఆశువుగాఁ నిట్లు చెప్పెనఁట.

Wouldst thou the young year's blossoms and the fruits of its decline

And all by which the soul charmed, enraptured, fed,

Wouldst thou the earth and heaven itself in one sole name combine ?

I name thee O! Sakuntala and all at once is said.

ఇన్నాటకముంగూర్చి యీ క్రింది శ్లోకము పరంపరగా వినవచ్చుచున్నది.

"కాళిదాసస్య సర్వస్వ మభిజ్ఞాన శకుంతలం
తత్రాపిచ చతుర్థోంకో యత్రయాతి శకుంతలా॥"

ఈ నాటకమునకున్న ప్రసిద్ధియే దీనికిఁ గల యనేకభిన్నపాఠములకుఁ గారణము. నేఁడీ నాటకమునకు నాల్గుభిన్నపాఠములు గలవు. మొదటిది గౌడీయపాఠము: దీనిని ప్రేమచంద్రతర్కవాగీశుఁడు 1860 లోను, డాక్టరు పిశ్చెల్ 1877 లోను ప్రకటించిరి. రెండవది దేవనాగర

* Kalidasa the moralist - Modern Revised xiv.

పాఠము: ఇద్దానిని ఈశ్వరచంద్రవిద్యాసాగరులు, ప్రొఫెసరు మోనియరు విలియమ్స్ ప్రకటించిరి. మూఁడవది కాశ్మీరపాఠము: ఇయ్యది గోడ్ బోలే, రాజవర్మ యను పండితులచేఁ బ్రకటింపబడ్డది. నాల్గవది దాక్షిణాత్య పాఠము: ఇయ్యది యాంధ్రాక్షరములతోడను తమిళులు సంస్కృతము కయి యుపయోగించెడి "గ్రంథాక్షరము"లతోడను ప్రకటితమయినది. ఈ నాల్గిటిలో దేవనాగర పాఠములకు దాక్షిణాత్య పాఠములకు భేదమంతగా లేదు. ఇవియే నిజమైనపాఠము లయియుండవోపునని పలువురు పండితుల యభిప్రాయము.

ప్రపంచమునందలి యుత్తమోత్తమ నాటకములలో నిది యొకటి. "ఇంగ్లీషుభాషలో నీ నాటకమునకుఁ బన్నెండు భాషాంతరములును, జర్మను భాషలోఁ బదునేనిమిదియు, ఇటాలియనులో నాలుగును, రష్యనులో మూఁడును, డ్యానిషులో రెండును, డచ్చిలో రెండును, స్వానిషు, పోలిషు హంగేరియన్, బొహిమియన్, ఐస్‌లాండిక్ భాషలలో నొక్కొక్కటియుఁ గలవు"* దీనిని మొట్టమొదట క్రీ. శ. 1789 లో సర్ విలియం జోన్స్ అను నాంగ్ల పండితుఁడు ఆంగ్ల భాషలోనికి భాషాంతరీకరించెను. నాఁటినుండి నేఁటిదాఁక నెల్లభాషలలోను చర్చాత్మక గ్రంథములు పెక్కులుపుట్టినవి. ఈ నాటకమిటీవల బర్సన్ పండితుని యాంగ్లానువాదము ననుసరించి ఆస్ట్రేలియాలోని రన్‌బోరన్ నగరమున బ్రదర్శితమైనది.

6. ఇందలి వర్ణనములు కొన్ని :

(క) స్వభావోక్తికినుత్తమోదాహరణ మనదగిన దీక్రిందిపద్యము:

"వడి బఱితెంచు తేరిదెసఁ బల్మఱు మాఱ్మెడ వెట్టి చూచుచుం
గడు శరపాతభీతిఁ దనకాయము ముందునకుం గుంచి యెంతయుం

* ఆంధ్రవిజ్ఞాన సర్వస్వము పుట 196.

బడలిక నోటినిండెఱచి మార్గమునిండ నగంబుదిన్న ద
ర్భలుపడ, మింటఁ బాఱెడు ధరంబదమూనక పెద్దదాటులన్"
(పుట. 4)

పై పద్యమును రథవేగమును దప్పించుకొనుటకయి లేడి పరువెత్తుట కనులకుఁ గట్టినట్లుగా వర్ణింపఁబడినది.

(ఖ) ఇట్టులే గుఱ్ఱముల వేగముకూడ స్వాభావికముగాఁ జెప్పబడినదనుట కీ క్రింది పద్యము దృష్టాంతము.

"పగ్గములన్ సడల్చుడును వాజులు మేనులు చాఁచిపాఱెడున్
నిగ్గగు చామరాగ్రములు నిశ్చలతన్ వహియింపఁగా జెవుల్
దిగ్గన నిక్కఁబెట్టి తమ లేపిన ధూళికి నంటరానివై
బెగ్గిలపాఱు నామృగము వేగము నైపక కూడఁ బాఱునాన్.

(గ) శకుంతల చిత్రమును దాను వ్రాసి యందింకను బూరింపఁ దలఁచుకొన్న భాగములనుగూర్చి రాజిట్టులనును.

"పులినములందు హంసయుగముల్ విహరించెడు మాలినీనదిన్
బలుహరిణంబు లున్న తిరుపాంత పవిత్రహిమాద్రిపాదమున్
వలువలుగట్టు శాఖలనువర్తిలు వృక్షము క్రింద నిల్చికో
మ్మునఁ దనకన్ను గోఁకికొను ముగ్ధమృగిన్ లిఖియింపఁగోరెదన్.

ప్రకృతితో, సృష్టితోఁ, దాదాత్మ్యమునొంది, వానిని నంతశ్చక్షువుతో సూక్ష్మముగాఁ బరికించినఁగాని యీ దృశ్యము గోచరముకాదు.

(ఘ) ఆకాశమునుండి త్వరగాఁ గ్రిందికి దిగువారికి భూమి యెట్లు కన్పించునో యనుట కీ క్రిందిపద్యము గమనింపుఁడు :

"అదె మహీ ప్రస్ఫుటాద్రి శిఖరావళినుండియు డిగ్గునట్టులా
మొదళులు తోఁపఁజెట్టుడిగె మున్నటు లాకులలో నడంగుటల్

నదులు తోఁజంగె డాయుట జలంబు కనంబడనట్టి రూపమున్
బదిగనెవండొ భూమి నిటు ప్రక్కకుఁ ద్రోసెనొ రీతిఁ దోఁచెడున్"

(పుట. 114)

(జ) చిన్నపిల్లలను ఎత్తుకొని మురిసిపోవుటలోఁ దలిదండ్రులు పొందెడి యానందమునకు మేర లేదు. ఇది స్వానుభవైకవేద్యము చూడుఁడు :

హేతువు లేని నవ్వుల నొకించుక చూపుచు లేఁతదంతముల్
వాతెఱ చిందనందముగఁ బల్కుచు స్పష్టముగాని వాక్కులన్
భూతలధూళి దేహమునఁ బూయుచు మైలయొనర్చు పుత్రులన్
బ్రీతిని ధన్యులెత్తి తొడమీదను జేర్చి సుఖింతు రెంతయున్"

(vi) నాల్గవయంకమునుగూర్చి శ్రీ కొమర్రాజు లక్ష్మణరావు గారు వ్రాసిన యీ క్రిందివాక్యము లెంతేని మనోహరములయి, సత్యములయి, కాళిదాసుసృష్టించిన కళాపరమార్థమును విశదము చేయుచున్నవి.

"కావ్యములలో నాటకము రమ్యము ; నాటకములలో శాకుంతలము ; అందు నాల్గవయంకము ; అందును నాల్గు శ్లోకములు మిక్కిలి రమ్యములని ప్రఖ్యాతి. నాల్గవ యంకమున కింత రమ్యత, ప్రఖ్యాతి కల్గుటకుఁ గారణమేమి ? ఎల్లప్పుడును మన కుటుంబములలో జరుగుచున్న 'ఆఁడుపిల్లలను అత్తవారి యింటికిఁ బంపుట' యనువ్యాపారమును కవి యీ యంకమునందు నున్నది యున్నట్లుగాఁ జిత్రించుటయే యీయంకముయొక్క యోగ్యత హెచ్చుటకుఁ గారణము. ఈయంకము చదివికాని, చూచిగాని, యే సహృదయుఁడు కంటఁ దడిపెట్టకుండును ? జాలి పడకుండును? తాను దనకూఁతు నత్తవారింటికిఁ బంపిన ప్రసంగమును జ్ఞప్తికిఁ దెచ్చుకొనకుండును? అందఱకును దెలిసినట్టియు, నందఱిమనస్సుల గరగించునట్టియు నీ 'కూఁతునత్తవారింటి కనుపు ప్రసంగము' కవిపుంగవునిచే నింత యథార్థముగా వర్ణింపబడుటఁజూచి యిచ్చటఁ గవి తనస్వాను

భవమునే వర్ణించెనా యేమి యని మనమూహించిన నూహింపవచ్చును. శ్లోకచతుష్టయములోనిది యగు "శౌండలమందె ఉండము శకుంతల తానిపుడేఁగునం చయో" యన్నపద్య మెవ్వని మనస్సు కరగింప కుండును ?

"ఇచ్చటఁ దండ్రి ఋషియైనను, తల్లి లేకపోయినను, ఇల్లు తపోవనమైనను, ఇతర జనులు బ్రహ్మచారులు, బ్రహ్మచారిణులు నయినను, వారి పవిత్రత కెంతయు భంగము రాకుండఁగ సామాన్య గృహస్థునింట నంపకములు జరుగుచున్నట్లుగనే కవి ఛాయాపటమును దింపియున్నాఁడు.

"పిల్లను పతియింటికిఁ బంపునప్పుడామెకు వస్త్రాభరణము లిచ్చుటయు, నొడిసింపుటయు, వెంటఁ దగినబంధువుల స్త్రీపురుషుల నిచ్చి పంపుటయు, పిల్లకుఁ దగినబుద్ధులు చెప్పుటయు, వెంటఁ జాలదూరము వఱకు వెళ్ళుటయు, ఆఁగవలసినదని యితరులు చెప్పువఱకుఁ బోవుచుండుటయు, పిల్ల బంధువులను కౌఁగిలించుకొని దుఃఖించుటయు, పోలేక పోలేక పోవుటయు, చివరకు 'అత్తవారింటికిఁ బంపితిని. నా భారముతీఱినది. మగఁడుపెండ్లాముసుఖమున్నఁజాలు' అని తండ్రి యనుకొనుటయు నీయంకమునందు మనయింట జరిగినట్లే చూపఁబడినది. ఈ సందర్భమున నీ క్రింది గద్యపద్యములు గమనింపవలసియున్నవి.

శకుంతల : ఇఁక నాకు సఖుల చేతియలంకారము దుర్లభముగదా! (అని కన్నీరు విడుచుచున్నది)

సఖులు : సఖీ! ఇట్లు శుభసమయమునం దేడుచుట నీకుఁదగదు.

(పుట. 61)

శుభకాలమం దేడుచుట తప్పని సమాధానము చెప్పుట యిప్పటికిని గలదు.

కాశ్యపులు :

గీ. తొలుత నీ నిమిత్తము నేను దలంచినట్లు
పుణ్యమున నీకుదగు భర్తఁ బొందితీవు
మావిఁ జేపట్టె నెలిమి నీ మాధవియును
గాన మీకయి యింకఁ జింతమానియుందు.

(పుట 65)

కూఁతునకుఁ దగిన సంబంధము దొరకఁగా దండ్రికి గలుగు సంతోషమిచ్చట నుపమానములతోఁ జెప్పఁబడినది.

కాశ్యపులు :

"గరిమ మహాకులీనుఁడగు కాంతుని పట్టపుదేవివౌచు దు
ర్భర ఘనకార్య వైభవముపైబడియుండి ప్రతిక్షణంబు భా
స్కరు నల పూర్వదిక్కువలెఁ గాంచి పవిత్రునిఁ బుత్రు వేగ మ
ద్విరహాభవాతి దుఃఖమును బిడ్డ! గణింపవు నీవు లేశముల్.

(పుట. 68)

గొప్పవారి యింటికిచ్చిన యమ్మాయిని దలిదండ్రులు గాని, యన్నదమ్ములు గాని, హాస్యమునకు 'మీ యత్తవారి యింటికి వెళ్ళిన తరువాత ఆ యంతఃపురములో కంటెలు, కాసుల పేరులలో మేము జ్ఞాపకముందుమా ?' అని అనుచుందురుగదా !

"కన్యయెపుడుఁ బరునిసొత్తె" (పుట. 70)

ఎన్నిదినములున్నను ఆఁడుపిల్ల యొకని యింటికిఁ బోవలసినదే యని మనవారు చెప్పెమాటయేకదా యిది ! *

7. ఔచిత్య ప్రశంస:

ఇందుకయి యీ నాటకమున కవి తీసికొనిన జాగ్రత మిక్కిలి కొనియాడఁ దగినది. సంభాషణములు నడుపుటలోఁగాని, వర్ణనలు

* చూ. ఆంధ్రవిజ్ఞాన సర్వస్వము పు. 206,207.

చేయుటలోఁగాని మర్యాదాభంగ మే మాత్రమును గలుగనట్లు కాళిదాసీ నాటక రచనమునకుఁ బూనుకొన్నాఁడు. ఇందు వినయమునకు, గొప్ప నీతి కల్పనకు నెక్కువస్థాన మొసఁగఁబడినది. చూడుఁడు. దుష్యంతుఁడు శకుంతలయు నేకాంతమున నుండఁగా నామె వెళ్ళఁజూచును. దుష్యంతుఁ డామెను బలవంతమున నాఁపఁ జూచును. ఆ సమయమున శకుంతల యన్న మాటలివి : "పౌరవ ! వినయమును రక్షింపుము" మఱొకసారి శకుంతలా దుష్యంతు లేకాంతమున నున్నప్పుడు రాజామెను ముద్దిడఁజూడఁగా నామె "నాట్యముచేఁ దప్పించుకొనును". తరువాత నా నాయికా నాయకులకు జరిగిన సంభాషణము, ఆ సన్నివేశమునఁ గలుగఁబోవు అశ్లీలము, అనౌచిత్యము వీనిని బరిహరించుట కేర్పఱచెనా యని తోఁచును. ఇందుకయి కావలయు, కవి గౌతమి రాక నాకస్మికముగాఁ బ్రవేశపెట్టుట జరిగినది.

(చూ. పుట. 51)

శకుంతలా జన్మవృత్తాంతమును అనసూయ వచించునప్పటి సంభాషణముకూడ నౌచిత్యముతోఁ గూడుకొన్నది. (పుట 18–రాజు : మహానుభావుఁడగు కాశ్యపుఁడు శాశ్వతబ్రహ్మనిష్ఠుఁడని ప్రసిద్ధి"–నుండి) అనసూయ : అంత నత్యంత రమణీయమగు వసంతకాలమున నున్మాదమును బుట్టించు నామె రూపమును జూచి ... (అని సగము చెప్పి లజ్జచే నూరకున్నది.)

రాజు : ఆ పయిని తెలియనే తెలియుచున్నది. తప్పక యీమె యప్సరస్సంభవయే." దీనినిబట్టి కనఁబడురంగములందే గాక వినఁబడు భాగములందును కవి కడు జాగ్రతవహించి వాక్పవిత్రతను ప్రకటించినాఁడు. "సగము చెప్పి" యనుటలో నౌచిత్యమెంత సూక్ష్మముగాఁ బాటింపఁబడినదో యూహించుట సులభము.

8. శకునములు :

శకునములపై జనులకు నమ్మిక యుండుట నేఁటికిని జూచుచున్నాము. దానిపైఁగల నమ్మకములను కవి యిందు రెండు చోటుల వెలిబుచ్చుట కాననగును.

రాజు తపోవనమును బ్రవేశింపఁగనే

"ఇది ప్రశాంతమహా నాశ్రమపదము చూడ
నదరెడు భుజంబు, ఫలమెట్టులొదవు నిందు
అట్లనగనేల భాగ్యంబు లమరనున్న
కాలమందు సర్వత్రమార్గములు గలుగు"

(పుట 8)

అని తనకుఁ గలుగఁబోవు లాభమునుగూర్చి యనుకొనును.

నాల్గవయంకమున శకుంతల నత్తవారింటి కనుపునప్పు డొక చక్రవాకి తామరాకు చాటున నున్న తన ప్రియుని గానక తల్లడిల్లుచున్నట్లు కానవచ్చును. ఈ శకునమువలన శకుంతలకుఁ గలుగబోవు పతివిరహము సూచ్యము.

మరల సప్తమాంకమున దుష్యంతుఁడు మరీచ్యాశ్రమము ప్రవేశించినప్పు డతని బాహు వదరును. అప్పుడు

రాజు : "కోరను మనోరథంబేను కొంచెమేని
వ్యర్థముగ నో భుజంబ! నీవదరెదేల?
మును నిరాకరించినమేలె పూనియిపుడు
దుఃఖముగ మాఱుచున్నది దుస్సహముగ" అని యనును.

(పుట 117)

నాయికానాయకుల పునస్సమాగమము త్వరలోనే కానున్నదని యిందు సూచింపఁబడినది.

పాత్రోన్మీలనము.

దుష్యంతుడు :

ఈ నాటకమునకు నాయకుఁడు దుష్యంతుఁడు. ఇతఁడు ధీరోదాత్తుఁడు. [1] మంచి యౌవనమున నున్నవాఁడనియు, వయసు ముప్పది ముప్పదేనేండ్లకు మించదనియుఁ జెప్పవచ్చును. [2] ఇతఁడు గంభీరాకారుడు, సత్త్వసంపన్నుఁడు, మృగయాప్రియుఁడు. ధనుర్విద్యయందు పినాకపాణివంటివాఁడు. కర్తవ్యదక్షత గలవాఁడు. "జ్యాకిణాంక బాహుభుజమెకాయరసి యింతదవ్వు రక్షించునద" యనెడి రాజునుద్దేశించి యన్న ఋషివాక్యమును బట్టియు, భ్రమరప్రకరణమున అనసూయాప్రియంవదలు శకుంతలతోడ నన్న "సన్ను కాచుటకు రాజును బిలువు"మనెడి వాక్యమును బట్టియు నరణ్యవాసులయెడ సైతము రాజెంత శ్రద్ధవహించియుండెనో గోచరమగును.

అయిదవయంకారంభమున రాజునకుఁగల పరిపాలనాదీక్ష వెల్లడియగును. [3] వైతాళికుల గానమువలన దుష్యంతునకుఁగల ప్రజావాత్సల్యము, స్వసుఖమును జూడమి, దుర్మార్గశిక్షణ, లోకకల్యాణమునందలి యిచ్ఛ మొదలగునవి బయల్పడును. [4] ఇతఁడు పరస్త్రీ విముఖుఁడు. శకుంతల సౌందర్యమును ప్రతీహారి విన్నవింపఁగా "పరకళత్రమును దేటి చూడరా" దని రాజు చెప్పెను. (పు. 76) అట్లే తుదియంకమున రాజు "పరదార పేరడుగుట న్యాయముకాదు" అనును.

(పుట. 121)

---

1 చూ. నాటకలక్షణ భాగము.

2 చూ. పుట 17 ప్రియంవదా వాక్యము; చతురగంభీరాకారంబు...."

3 చూ. పుట 73, 74 కంచుకి; ఓయీ ! రాజునకు....ఇత్యాది.

4 చూ. పుట 75 వైతాళికుల ప్రథమద్వితీయుల పద్యములు.

దుష్యంతుని ప్రజావాత్సల్య మాఱవయంకమందలి ధనమిత్రుని యాస్తిపంపకమునఁ దేటపడఁగలదు. అంతేగాదు. "ప్రజ లెవరి నెవ్వరిని ప్రాణబంధువులను దారు పోగొట్టుకొందురో వారికెల్ల సర్వమునకు దానే" యని రాజు చాటఁ బంపును.

శకుంతలయెడ నితనిప్రేమ సత్త్వప్రధానమైనది. "పరిహరింపఁ దగిన వస్తువుల పయి పౌరవుల మనస్సుపోదు" అని రాజు అభిమాన పూర్వకముగాఁ జెప్పుటలో నతని సౌశీల్యము విశదమగుచున్నది.

రాజునకు చిత్రకళానైపుణి గలదని యాఱవయంకమున స్పష్టమగును.

శకుంతల :

ఈమె సౌందర్యరాశి. ఈ నాటకమునకు నాయిక. "ఈమె మొదట రంగముపై నేమాయయు నెఱుఁగని యరణ్యకన్యగాఁ గాన్పించి క్రమముగా నెన్నియో యవస్థాంతరములఁ జెంది తుదకు బుత్రవతియైన మహారాజ్ఞిగా మాఱును" [1] వేర్వేఱు "ప్రసంగములయప్పు డామె చూపినట్టి సద్గుణములును, మనోధైర్యమును, శుద్ధాంతఃకరణమును దెల్పు నవ్యాజానురాగమును మన యంతఃకరణములు గరగించి యామెయెడఁ సానుభూతిని, గౌరవమును పుట్టించును." [2] శకుంతలకు సృష్టియందు నిసర్గ ప్రీతి గలదు. "ఎవతె జలంబు మీకిడక యెన్నఁడు త్రావదు" ఇత్యాది పద్యములను బట్టి యామె సృష్టిలో నెంతగా తాదాత్మ్యము పొందునో మనకుఁ దెలియును.

శకుంతల సహజభీరువు, లజ్జావతి. ఆర్యస్త్రీకి నుండవలసిన మర్యాద, గౌరవము, వినయశీలత మొదలగువాని నెంతో యధిక

---

1 ఆంధ్రవిజ్ఞానసర్వస్వము. పుట 212.

2 అందే—పుట 213.